


పింఛా గేటెత్తారు...



సుండుపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పింఛా ప్రాజెక్టు నుంచి నదిలోకి నీటిని విడుదల చేశారు. 1102 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టు గేటు ద్వారా విడుదల చేసినట్లు ప్రాజెక్టు అధికారి తెలిపారు. ప్రాజెక్టు దిగువ భాగంలో చిన్నబిడికి దిగువ భాగంలో లెవెల్ వంతెనపైగా నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రెడ్డివారిపల్లె దిగువ భాగంలో మట్టి రోడ్డు కొట్టుకుపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

మల్లయ్యకొండకు రూ.13 లక్షల ఆదాయం



హుండీ కానుకలను లెక్కిస్తున్న భక్తులు

తంబళ్లపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మల్లయ్యకొండలో భక్తులు హుండీలో సమర్పించిన కానుకల ద్వారా రూ.13.10 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో మునిరాజ తెలిపారు. బుధవారం ఆలయంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఈవో, కూటమి నేతల పర్యవేక్షణలో భక్తులు హుండీలో వేసిన కానుకలను లెక్కించారు. ఈ ఏడాది జూలై 15వ తేదీ నుంచి డిసెంబరు 3వ తేదీ (4 నెలల 18 రోజుల) వరకు వచ్చిన హుండీ కానులను లెక్కించగా ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఉత్తమ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పురుషోత్తం, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తినాయుడు, తెలుగు యువత నరసింహులు, బాలకృష్ణారెడ్డి, రామలింగారెడ్డి, ఆలయ అర్చకులు ఈశ్వరప్ప, మల్లికార్జున, రికార్డు అసిస్టెంట్ కొండకిట్ట, ఈశ్వర తదితరులు పాల్గొన్నారు. ఈనెల 6వ తేదీ శనివారం మల్లయ్యకొండ దేవస్థానంలో వివిధ పనులకు ఏడాది పాటు హక్కులను పొందడానికి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

జిల్లాలో 22 మంది ఎస్‌ఐల బదిలీ

రాయచోటిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 22 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ బుధవారం ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	పనిచేస్తున్న ప్రాంతం	బదిలీ
బాలకృష్ణ	రాయచోటి అర్బన్	గుర్రంకొండ
రఘురాం	గుర్రంకొండ	పెనగలూరు
అబ్దుల్ జహీర్	డీఎస్‌బీ	రాయచోటి అర్బన్
జి.రవికుమార్	సంబేపల్లె	పెద్దమండెం
ఎం.వెంకటేశ్వర్లు	పెద్దమండెం	డీఎస్‌బీ-1
పి.వెంకటేశ్	రాజంపేట అర్బన్	సంబేపల్లె
ఎస్.వినోద్‌కుమార్	అన్నమయ్య	చిట్వేలి
ఎ.వెంకటేశ్వర్లు	వీఆర్	రాజంపేట
ఎం.శ్రీనివాసులు	సుండుపల్లె	డీసీఆర్‌బీ
ఖాజాహుస్సేన్	వీఆర్	టి.సుండుపల్లె
పి.వెంకటసుధాకర్‌రెడ్డి	రామాపురం	డీపీటీసీ
కేబీ శివకుమార్	మదనపల్లె	రామాపురం
బి.వెంకటశివకుమార్	వీఆర్	కేవీపల్లి
వి.చిన్నరెడ్డెప్ప	కేవీపల్లి	పుల్లంపేట
సి.మధు రామచంద్రుడు	డీసీఆర్‌బీ	ముదివేడు
ఎస్.గాయత్రి	మదనపల్లి	మహిళా స్టేషన్
డి.రమేశ్‌బాబు	రామసముద్రం	సైబర్ క్రైం
పి.దిలీప్‌కుమార్	ముదివేడు	రామసముద్రం
సి.తిప్పేస్వామి	నిమ్మనపల్లి	సైబర్ క్రైం
ఎం.విష్ణునారాయణ	వీఆర్	నిమ్మనపల్లి
సి.హహరహర ప్రసాద్	పీటీఎం	డీసీఆర్‌బీ
బి.పరమేశ్‌నాయక్	వీఆర్	పీటీఎం

సహకరించిందెవరు...?

- ఎక్సైజ్ సిబ్బంది ప్రమేయంపై విచారణ
- కాల్‌డేటా, యూపీఐ లావాదేవీల ఆధారంగా చర్యలు
- మరి కొంతమందిపై వేటు పడే అవకాశం...?
- ప్రిలిమినరీ చార్జిషీట్ దాఖలుకు ఎక్సైజ్ అధికారుల సమాయత్తం



ములకలచెరువు ఎక్సైజ్ స్టేషన్



నకిలీ మద్యం బాటిళ్లు (ఫైల్)

ములకలచెరువు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపిన ములకలచెరువు నకిలీ మద్యం వ్యవహారం కీలక దశకు చేరుకుంటోంది. నకిలీ మద్యం వ్యవహారంలో కింగ్ పిన్‌గా వ్యవహరించిన ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దన్‌రావుతో పాటు వైసీపీకి చెందిన మాజీ మంత్రి జోగి రమేశ్ తదితరులను పీటీ వారెంట్‌పై ములకలచెరువు కేసులో అరెస్టు చూపి రిమాండ్‌కు తరలించారు. ములకలచెరువు కేసులో నలుగురు మినహా అరెస్టుల పర్వం దాదాపుగా పూర్తి కావస్తుండడంతో ఎక్సైజ్ అధికారులు నిందితులకు సహకరించిన ఎక్సైజ్ పోలీసులు, సిబ్బందిపై దృష్టి పెట్టినట్లు వెల్లడవుతోంది. ఇందులో భాగంగానే తాజాగా ములకలచెరువులో పనిచేస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ భాస్కర్‌ను సస్పెండ్ చేశారు. ఇతడిపై వచ్చిన ఆరోపణలు రుజువు కావడంతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. కానిస్టేబుల్ భాస్కర్ ఓ నిందితుడితో పలుమార్లు ఫోన్‌లో మాట్లాడినట్లు వెల్లడి కావడంతో చర్యలు తీసుకున్నట్లు ఎక్సైజ్ శాఖలో తీవ్ర చర్చ జరుగుతోంది. అలాగే మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు మణి, కిరణ్, పుంగనూరు ఎక్సైజ్ స్టేషన్‌లో పనిచేస్తున్న వినోద్‌కుమార్, నరేంద్రరెడ్డిలపై కూడా ఆరోపణలు రావడంతో చిత్తూరు జిల్లాకు అటాచ్ చేస్తూ చర్యలు తీసుకున్నారు. వీరిలో మణి, కిరణ్‌లు గతంలో ములకలచెరువు ఎక్సైజ్ స్టేషన్‌లో పనిచేశారు. మిగిలిన ఇద్దరు డీటీఎఫ్‌లో పనిచేసినట్లు తెలిసింది. గతంలో ములకలచెరువు సీఐ హిమబిందును కూడా సస్పెండ్ చేశారు. తాజా చర్యలు ఎక్సైజ్ శాఖలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

ములకలచెరువు నకిలీ మద్యం తయారీలో కీలక నిందితులకు సహకరించిన అధికారులు, సిబ్బంది ప్రమేయంపై కూడా సిట్, ఎక్సైజ్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టినట్లు ఎక్సైజ్ శాఖలో జోరుగా చర్చ జరుగుతోంది. ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు, నకిలీ మద్యం తయారీ కేంద్రానికి ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన కట్టా రాజుతో పాటు నిందితుడు రాజేశ్‌లతో పలుమార్లు ఫోన్‌లో మాట్లాడిన అధికారులు, సిబ్బంది వివరాలు కూడా సేకరించి వారి కాల్‌డేటా తీసుకున్నట్లు సమాచారం. అలాగే కీలక నిందితుల నుంచి ఎక్సైజ్ అధికారులు, సిబ్బందికి వచ్చిన యూపీఐ లావాదేవీలపై కూడా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. దీని ఆధారంగా నకిలీ మద్యం తయారీకి సహకరించిన మరికొంత మందిపై వేటు పడే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. దీంతో నకిలీ మద్యం తయారీకి సహకరించిన అధికారులు, సిబ్బంది గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. కాగా ములకలచెరువు నకిలీ మద్యం కేసుకు సంబంధించి తంబళ్లపల్లె కోర్టులో ప్రిలిమినరీ చార్జిషీట్ దాఖలుకు ఎక్సైజ్ అధికారులు సమాయత్తం అయ్యారు. దీనికి సంబంధించి చార్జీషీట్‌ను మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌లో రూపొందించి పరిశీలన నిమిత్తం సిట్ అధికారులకు పంపారు. సిట్ అధికారులు పరిశీలించి మార్పులు సూచించిన తరువాత చార్జిషీట్ దాఖలు చేయనున్నట్లు తెలిసింది. నకిలీ మద్యం కేసులో మొదటగా 10 మంది నిందితులను అరెస్టు చేసి 90 రోజులు కావస్తుండడంతో ప్రీలిమినరీ చార్జిషీట్ దాఖలు చేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

జోగి సోదరుల పాత్రపై కీలక ఆధారాలు లభ్యం

ములకలచెరువు నకిలీ మద్యం తయారీలో మాజీ మంత్రి జోగి రమేశ్, అతడి సోదరుడు జోగి రాము పాత్రపై ఎక్సైజ్ పోలీసులు కీలక ఆధారాలు సేకరించారు. ఇబ్రహీంపట్నం కేసులో రెండుసార్లు ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దన్‌రావు, అతడి తమ్ముడు జగన్‌మోహన్‌రావులను కస్టడీకి తీసుకుని విచారించడంతో ములకలచెరువులో నకిలీ మద్యం తయారీలో జోగి సోదరుల ప్రమేయం, పాత్ర బయటపడింది. దీంతో జోగి సోదరులను ములకలచెరువు కేసులో నిందితులుగా చేర్చి పీటీ వారెంట్‌పై మంగళవారం తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరిచారు. ములకలచెరువు నకిలీ మద్యం తయారీకి సంబంధించి జోగి సోదరులకు ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దన్‌రావు, అతడి తమ్ముడు జగన్‌మోహన్‌రావు ముడుపులు ఇచ్చినట్లు ఎక్సైజ్ అధికారుల విచారణలో వెల్లడైనట్లు తెలిసింది.

రెండు నెలలవుతున్నా తగ్గని నకిలీ మద్యం వేడి

రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన ములకలచెరువు నకిలీ మద్యం వ్యవహారం బయటపడి రెండు నెలలు అవుతున్నా వేడి మాత్రం ఇంతా తగ్గలేదు. ములకలచెరువు నకిలీ మద్యం తయారీ గుట్టును ఎక్సైజ్ పోలీసులు అక్టోబరు 3వ తేదీ రట్టు చేశారు. ఈ వ్యవహారం బయటపడి సరిగ్గా బుధవారం నాటికి రెండు నెలలు నెలలైంది. ఇప్పటి వరకు మొత్తం 33 మందిపై నకిలీ మద్యం కేసు నమోదు కాగా 29 మంది నిందితులను అరెస్టు చేశారు. ఇంకా నలుగురిని అరెస్టు చేయాల్సి ఉంది.



సంక్షేమమే ధ్యేయంగా రైతన్నా.. మీకోసం...




మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి

రాయచోటిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతన్నా... మీకోసం వినూత్న కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం నల్లజర్ల రైతుసేవా కేంద్రం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొనగా రాయచోటి మండలం గొర్లముదివేడు రైతు సేవా కేంద్రం నుంచి మంత్రి మండిపల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో పంచసూత్రాలపై ఏడు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించామని, అగ్రిటెక్‌పై రైతుల్లో చైతన్యం తీసుకువచ్చామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారులు, మండల అభివృద్ధి అధికారులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచు ముసుగులో మల్లయ్యకొండ

తంబళ్లపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి కొలువుదీరిన మల్లయ్యకొండను బుధవారం మంచు తెరలు కమ్మేశాయి. తుఫాను ప్రభావంతో కురుస్తున్న తేలికపాటి చిరుజల్లులకు తోడు మల్లయ్య గిరులను పొగమంచు, దట్టమైన మేఘాలు కమ్మేయడంతో కొండ అంతా ప్రకృతి రమణీయతతో పులకరించింది. కొండకు వచ్చిన భక్తులు మంచు తెరల నడుమ మల్లికార్జున స్వామి వారి ఆలయాన్ని చూసి తన్మయత్వం చెందారు. మంచుతెరల మాటున అడవుల ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సెల్‌ఫోన్లలో బంధించి పరవశించిపోయారు.



మంచు తెరలు, మేఘాల మధ్య మల్లయ్యకొండ

ఆలయం వద్ద మంచు

కుక్కలదొడ్డి అటవీ మార్గంలో
తిరుమల పాదయాత్ర పూర్తిగా నిషేధం

- ఎస్పీ ధీరజ్, డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ, డీఎఫ్‌వో

రాజంపేట టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కుక్కలదొడ్డి అటవీ మార్గం ద్వారా తిరుమల పాదయాత్ర పూర్తిగా నిషేధించామని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, జిల్లా ఫారెస్ట్ అధికారి జగన్నాథ్‌సింగ్ తెలిపారు. గురువారం రాజంపేట జిల్లా అటవీశాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కుక్కలదొడ్డి అటవీ మార్గం గుండా తిరుమల పాదయాత్ర చేయడానికి అనేక మంది సిద్ధమయ్యారన్నారు. వారిని అటవీ మార్గం గుండా అనుమతించే ప్రసక్తే లేదన్నారు. ఈ మార్గంలో ప్రస్తుతం భారీ వర్షాలు పడి అటవీమార్గంలో వెళ్లడం చాలా ప్రమాదకరంగా ఉందన్నారు. అదేవిధంగా అడవిలో ఏనుగులు, పులులు, ఇతర అటవీ జంతువులు సంచరిస్తున్నాయని పేర్కొన్నారు. గతంలో ఇలా వెళ్లిన వారిపై ఏనుగులు దాడి చేయడంతో పలువురు మృతి చెందారని, అనేకసార్లు భక్తులు గాయపడ్డ సందర్భాలున్నాయన్నారు. భక్తులకు ఇబ్బంది కలగకూడదని ఈ బాటను నిషేధించామన్నారు. తిరుమలకు వెళ్లే భక్తులు రోడ్డు మార్గం గుండానే వెళ్లాలని సూచించారు. ఎవరైనా కుక్కలదొడ్డి అటవీ మార్గం ద్వారా వెళ్లాలనుకుంటే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంచ సూత్రాలతో లాభసాటిగా వ్యవసాయం

- కలెక్టర్ నిశాంత్‌కుమార్



రైతన్నా... మీకోసం కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

వీరబల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచ సూత్రాల అమలుతో రైతులకు వ్యవసాయం లాభసాటి అవుతుందని, అధిక లాభాలు పొందవచ్చని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. బుధవారం వీరబల్లి మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో రైతన్నా...మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో పలు అంశాలపై చర్చించి వారి సమస్యలను, సలహాలను తెలుసుకుని అధికారులకు దిశానిర్దేశం చేసి వీటికి సంబంధించిన ప్రణాళికలను తయారు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఐదు సంవత్సరాల్లో రైతులకు వ్యవసాయం లాభసాటి కావాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం పంచసూత్రాల లక్ష్యంగా నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు అందించే విధంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. గంగనేరు ప్రాజెక్టు నుంచి వంగిమళ్లకు వచ్చే కాలువ పూడిక తీసే పనులు పూర్తి చేసి దాదాపు 1100 ఎకరాలు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖాజాబీ, మండల అభివృద్ధి అధికారి గౌస్‌పీర్, మండల వ్యవసాయశాఖ అధికారి స్వాతి, మండల ఉద్యానవనశాఖ అధికారి వనిత, ఇరిగేషన్ ఏఈ, వీరబల్లి టీడీపీ మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, సింగిల్‌విండో ప్రెసిడెంట్ రామేశ్వర్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలి : ఎస్పీ





సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, హాజరైన జిల్లాలోని హోంగార్డులు

రాయచోటిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హోంగార్డులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుని ప్రజలకు మరింత నాణ్యమైన సేవలందించాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. బుధవారం ఆయన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో హోంగార్డ్స్ మొబలైజేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇందులో ముఖ్యంగా డ్రిల్, ఆమ్స్ డ్రిల్, లాఠీ డ్రిల్ వంటి క్రమశిక్షణా అంశాలు, బందోబస్తు విధులు, ట్రాఫిక్ నిర్వహణ, మాబ్ కంట్రోల్ వంటి అంశాలపై సమగ్ర శిక్షణ ఉంటుందన్నారు. హోంగార్డ్స్ తప్పనిసరిగా తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యంగా ప్రయాణాల్లో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్‌ను కలిగి ఉండాలన్నారు. హోంగార్డులకు జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ఈనెల 6వ తేదీ శనివారం వరకు కొనసాగుతుందన్నారు. ఇందులో భాగంగానే 6న హోంగార్డ్ రైజింగ్‌డే వేడుకలు జరగనున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు వీజే రామకృష్ణ, ఎం.పెద్దయ్య, ఆర్‌ఎస్‌ఐ శ్రీనివాసులు, ఏఆర్ ఎస్‌ఐ బాలాజీ, హెడ్ కానిస్టేబుళ్లు రమేశ్, లక్ష్మిరెడ్డి ఆశిక్‌బాషాతో పాటు జిల్లాలోని హోంగార్డులు పాల్గొన్నారు.


జిల్లా కేంద్రం కోసం భారీ ర్యాలీ

- ఆందోళనలతో దద్దరిల్లిన రాజంపేట
- ర్యాలీకి నేతృత్వం వహించిన కోడూరు ఎమ్మెల్యే శ్రీధర్
- రాజంపేట సబ్ కలెక్టర్ భావనకు వినతిపత్రం



రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, జనసేన పార్లమెంట్ నాయకులు అతికారికృష్ణ, శ్రీనివాసరాజు తదితరులు

రాజంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలన్న ఆందోళనలో భాగంగా జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం రాజంపేట పట్టణంలో నిర్వహించిన ర్యాలీతో రాజంపేట దద్దరిల్లింది. రాజంపేట పాతబస్టాండు నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో రాజంపేట, కోడూరు నియోజకవర్గాలకు సంబంధించిన కూటమి నేతలు పాల్గొని రాజంపేట జిల్లా కేంద్రం చేయాలంటూ రాయచోటి వద్దు - రాజంపేట ముద్దు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ అరవ శ్రీధర్, జనసేన పార్టీ పార్లమెంటరీ సమన్వయకర్త అతికారి కృష్ణ, శ్రీనివాసరాజు, రాష్ట్ర జనసేన పార్టీ కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, కోడూరు నియోజకవర్గ టీడీపీ నాయకుడు పంతగాని నరసింహప్రసాద్, జేఏసీ నేతలు, టీడీపీ రాజంపేట పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, జేఏసీ నాయకులు అబ్బూరు ప్రభాకర్‌నాయుడు, కాంగ్రెస్ రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూల విజయభాస్కర్, డిగ్రీ కళాశాలల సంఘ అసోసియేషన్ అధ్యక్షుడు గీతాంజలి రమణ, బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చ ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి చిట్వేలి రవికుమార్, సీపీఎం నాయకులు సికిందర్, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, మహిళా నేతలు లత, రమా, రేణుకమ్మలతో పాటు అనేకమంది నేతలు ఈ ర్యాలీకి సారథ్యం వహించగా టీడీపీ, జనసేన, బీజేపీ కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం పార్టీలకు చెందిన ఉద్యమ నేతలు తదితరులు పాల్గొన్నారు. ర్యాలీలో పెద్దఎత్తున మహిళలు, వృద్ధులు, అన్నివర్గాల ప్రజలు, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో ర్యాలీ సందర్భంగా సుమారు గంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా పాతబస్టాండులో మానవహారం నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ భావనకు వినతిపత్రం అందచేశారు.



రాజంపేట సబ్‌కలెక్టర్ భావనకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, ఇతర నాయకులు

సహకార వ్యవస్థలు బలోపేతం

- టౌన్ బ్యాంకు శత వార్షికోత్సవంలో ఎమ్మెల్యేలు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, ఎమ్మెల్యేలు

మదనపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ రంగంలో సహకార అర్బన్ బ్యాంకులు చాలా బలమైనవని సహకార శాఖ హౌస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు, పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమర్‌నాథరెడ్డి అన్నారు. స్థానిక బుగ్గ కాలువలోని ఎస్‌వీఆర్ కల్యాణమండపంలో బుధవారం టౌన్ బ్యాంకు శతవార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సమావేశానికి అయిదుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీతో పాటు రాష్ట్ర స్థాయిలోని సహకార బ్యాంకు చైర్మన్లు, ఆయా సంఘాల నాయకులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఎమ్మెల్యే ఎం.షాజహాన్ బాషా మాట్లాడుతూ సహకార రంగంలో ఆర్‌బీఐ నిబంధనలు పాటిస్తూ, ఖాతాదారుల్లో నమ్మకాన్ని కలిగిస్తూ 1924లో రూ.410 మూలధనంతో ప్రారంభమైన మదనపల్లె టౌన్ బ్యాంకు ప్రస్తుతం రూ.100 కోట్ల డిపాజిట్లు, రూ.175 కోట్ల టర్నోవర్‌తో నడుస్తోందన్నారు. పీలేరు ఎమ్మెల్యే ఎన్.కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మనకు జిల్లా రావడం, టౌన్ బ్యాంకు వందేళ్ల జరుపుకోవడం ఒకేసారి రావడం సంతోషంగా ఉందన్నారు. టౌన్ బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ మాట్లాడుతూ తాను బ్యాంకు డైరెక్టర్‌గా, ఉపాధ్యక్షుడిగా, 2011 నుంచి చైర్మన్‌గా పనిచేసి, బ్యాంకును అన్ని విధాలా అభివృద్ధి చేయడం తన అదృష్టంగా పేర్కొన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కాకినాడ మాజీ ఎంపీ, ఎమ్మెల్యే, ప్రస్తుత అర్బన్ బ్యాంకు చైర్మన్ చిట్టూరు రవీంద్ర, విశాఖ అర్బన్ బ్యాంకు చైర్మన్ సి.రాఘవేంద్రరావు మాట్లాడారు. అనంతరం బ్యాంకు ముద్రించిన సావనీర్‌ను ఎమ్మెల్యేలు, ప్రముఖులు ఆవిష్కరించారు. చిన్నారుల సాంస్కృతిక, గేయాలతో సభికులను అలరింపచేశారు. సమావేశంలో మిట్స్ యూనివర్శిటీ చాన్సలర్ నాదెళ్ల విజయ్‌భాస్కర్ చౌదరి, పీకేఎం ఉడా చైర్మన్ బి.ఆర్.సురేశ్‌బాబు, బీజేపీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు సాయిలోకేశ్, టీడీపీ నాయకులు రాటకొండ బాబురెడ్డి, మార్పూరి సుధాకర్‌నాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరామ్‌చినబాబు, పీటీఎం శివప్రసాద్, ఎంఆర్‌పీఎస్ నరేంద్రబాబు, జనసేన నాయకురాలు దారం అనిత, విజయభారతి ఎన్.సేతు, ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి టీడీపీ నాయకులు, బ్యాంకు సీఈవో పి.వి.ప్రసాద్, డైరెక్టర్లు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సహకార శాఖ అర్బన్ బ్యాంకు చైర్మన్‌లు, ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



అందని మిషన్... ఆగిన కుట్టు

● పూర్తయిన శిక్షణ ● ఉచిత కుట్టుమిషన్ల కోసం మహిళలు
● వేతనాల కోసం ట్రైనర్లు ● నెలల తరబడి ఎదురు చూపులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళల ఆర్థిక స్వావలంభన చర్యలు తీసుకోవడంలో భాగంగా కుట్టుశిక్షణతో వారికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో మహిళ దినోత్సవం రోజున కుట్టుశిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ కుట్టుశిక్షణ కేంద్రాలకు తగినన్ని నిధులు లేకపోవడంతో అవి బాలారిష్టాలను నడుమ కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో శిక్షణ కేంద్రాలను తాత్కాలికంగా మూసివేసినట్లు తెలుస్తుంది. మహిళలకు కుట్టుశిక్షణ ఇచ్చి డిమాండ్‌లో ఉన్న వివిధ రకాల దుస్తుల తయరీలో మెళకువలు నేర్పించేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 24 శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా శిక్షణ పొందేందుకు వివిధ ప్రాంతాల్లోని అర్హులైన 15594 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో తొలి విడతగా 3068 మందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ఎక్కడ కూడా అక్రమాలు చోటు చేసుకోకుండా శిక్షణ కార్యక్రమాలను పారదర్శకంగా సాగే విధంగా చర్యలు తీసుకున్నారు. శిక్షణకు హాజరైన వారందరికీ డిజిటల్ అటెండెన్స్ ద్వారా హాజరు నమోదు చేయడం జరిగింది.90 రోజుల పాటు ఇచ్చే కుట్టుశిక్షణకు 75శాతం హాజరైన వారికి ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేస్తామని ప్రకటించారు. ఈ క్రమంలోజిల్లాలోని అన్నిశిక్షణ కేంద్రాల్లో 90 రోజులపాటు శిక్షణ కొనసాగింది. ఇందులో 70 రోజుల పాటు ఆసక్తిగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు ఇవ్వాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు ఒకరికి కూడా కుట్టుమిషన్ అందించిన పరిస్థితి లేదు. అంతేకాకుండా కుట్టుశిక్షణ పొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు కూడా ఇవ్వకపోవడంతో వేలాది మంది మహిళలు కుట్టుమిషన్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి.

ఆగిన కుట్టుశిక్షణ

ప్రభుత్వం కుట్టుశిక్షణతో పాటు ఉచితంగా కుట్టుమిషన్లు ఇస్తామనడంతో జిల్లాలో వేలాది మంది కుట్టుశిక్షణ తీసుకునేందుకు ఆసక్తి చూపారు. ఒకసారి శిక్షణ తీసుకుంటే కుట్టుమిషను ద్వారా స్వయం ఉపాధి పొంది కుటుంబానికి ఆర్థికంగా ఆదరువుగా నిలవాలనేది వారి ఉద్దేశ్యం. అంతేకాకుండా ఇంట్లో పనిచేసుకుంటూ కుట్టుమిషన్ల ద్వారా మరింత మెరుగైన జీవనోపాధులను పొందవచ్చని ఆశించారు. ఈ కారణంగానే కుట్టుశిక్షణ పొందడం కోసం జిల్లాలో 15594 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇప్పటి వరకు 3068 మందికి మాత్రమే శిక్షణ ఇచ్చారు. మిగిలిన వారికి మరోవిడతలో శిక్షణ ఇచ్చే విధంగా జిల్లా అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది. కానీ తొలివిడ తలో శిక్షణ పొందిన వారికే ఉచిత కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు ఇప్పటి వరకు ఇవ్వకపో వడం గమనార్హం.



శిక్షణ తీసుకుంటున్న మహిళలు (ఫైల్)

కుట్టు శిక్షణ కేంద్రాల మూసివేత

ప్రస్తుతానికి కుట్టుశిక్షణ కేంద్రాలను మూసివేసినట్లు తెలుస్తోంది. కేవలం శిక్షణకు అభ్యర్థులను ఎంపిక చేయడం, శిక్షణ నిర్వహణను పర్యవేక్షించడం వరకే అధికార యంత్రాంగం బాధ్యతగా తెలుస్తోంది. శిక్షణ కేంద్రాల ఏర్పాటు, ట్రైనర్ల ఎంపిక, వేతనాల చెల్లింపు, ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ బాధ్యతలను ప్రభుత్వం ఒక ప్రైవేటు కాంట్రా క్టర్‌కు అప్పగించింది. మొదటి విడతకు సంబంధించిన బిల్లులు పెండింగులో ఉన్నాయంటూ శిక్షణ కార్యక్రమాలను ఆపివేశారు. దీంతో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు కుట్టుమిషన్ల కోసం, శిక్షణ ఇచ్చిన ట్రైనర్లు వేతనాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఈ విషయమై బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్.జయసింహను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా... మొదటి విడత శిక్షణ అయిపోయిందన్నారు. ఆ తరువాత ప్రభుత్వం నుంచి తగిన ఆదేశాలు వచ్చిన వెంటనే ప్రభుత్వ నిర్ణయం మేరకు మిగిలిన వారికి కుట్టుశిక్షణ ఇచ్చే కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు.

జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో తనిఖీలు



ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న క్వాలిటీసెల్ అధికారి


జమ్మలమడుగు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం అన్నమయ్య జిల్లా క్వాలిటీ సెల్ అధికారిణి నాగరాణి తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అన్ని విభాగాలు పరిశీలించి శుభ్రతకు సంబంధించి సిబ్బందితో మాట్లాడారు. రక్త పరీక్షల కేంద్రంలో అక్కడ సిబ్బందితో, రోగులతో ఆమె మాట్లాడారు. శానిటేషన్, శుభ్రతపై బయోమెడికల్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ ఇన్‌స్పెక్షన్ తదితర విషయాల్లో చర్చించారు. శుభ్రతగా ఉండాలని సూచించారు. అయితే జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది ఆస్పత్రిని శుభ్రంగా పెట్టడంపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ రఫీక్‌పాషా, ల్యాబ్ టెక్నీషియన్ రామచంద్ర, అక్కడున్న సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. కడప నగరం శంకరాపురంలోని ప్రభుత్వ అంధుల పాఠశాలలో బుధవారం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి విభిన్న ప్రతిభావంతుల గౌరవం, హక్కులు, వారికి అందుతున్న సదుపాయాలు, సహాయ సహకారాలను తెలియపరిచారు. మేధో వైకల్యాలు ఉన్న వ్యక్తులకు చట్టపరమైన సేవలు పథకం 2024, దివ్యాంగజన్ హెల్ప్ లైన్ నెంబర్ 14456, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 తదితర అంశాలను తెలియపరిచారు. అనంతరం ఆటపోటీలలో గెలుపొందిన పిల్లలకు సర్టిఫికెట్లను అందజేశారు.



మోరగుడి పీహెచ్‌సీలో గొడవ

● స్వీపర్ ఆత్మహత్యాయత్నం ● ఆస్పత్రికి తాళం వేసిన సిబ్బంది





చికిత్స పొందుతున్న స్వీపర్ సుజాత, పీహెచ్‌సీకి తాళం వేసిన దృశ్యం

జమ్మలమడుగు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోరగుడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం గొడవ జరిగింది. ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ తస్మియా, సిబ్బంది విధుల విషయంలో తనపై వేధింపులకు పాల్పడుతున్నారంటూ స్వీపర్ సుజాత పెట్రోలు వంటిపై పోసుకుని ఆత్మహత్యాప్రయత్నం చేసింది. దీంతో వెంటనే డాక్టర్, అక్కడున్న సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తాళం వేశారు. అప్పటికే అక్కడున్న బాధితురాలి బంధువులు జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతోంది. వివరాలిలా... మోరగుడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వీపర్ సుజాతకు డాక్టర్ తస్మియా, సిబ్బంది మధ్య విధులకు సంబంధించి వివాదం జరుగుతోంది. స్వీపర్ తనకు సెలవులు అడిగినా డాక్టర్ మంజూరు చేయడం లేదని.. పనికి సంబంధించి సిబ్బంది వేధింపులకు గురిచేస్తుండ డంతో ఆత్మహత్యాయత్నం చేసినట్లు బాధితురాలి బంధువులు తెలిపారు. కాగా, ఆస్పత్రి డాక్టర్ తస్మియా, సిబ్బంది తాము స్వీపర్‌తో మాట్లాడుతుండగా ఆమె బంధువులు తమపై దాడి చేశారని ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి అర్బన్ సీఐ నరేష్‌బాబు విచారణ చేసి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

వల్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కడప - తాడిపత్రి ప్రధాన రహదారిలో గోటూరు పాత టోల్‌గేటు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు కర్నూలుకు చెందిన వెంకటేశులు, లక్ష్మీదేవి ద్విచక్రవాహనంలో కడప నుంచి కమలాపురం వైపు వస్తున్నారు. అదే సమయంలో వల్లూరు నుంచి కడప వైపు వెళుతున్న ఆటో వీరిని ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయలైనట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. కానీ ప్రమాదంలో గాయడపడ వెంకటేశ్వర్లు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించినట్లు సమాచారం. అలాగే మరో ప్రమాదంలో గోటూరు సమీపంలోని పెట్రోలు బంకు వద్ద క్రేన్ ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో స్కూటరిస్టుకు గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కొప్పోలికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కూలీలతో వెళుతున్న ఆటోను ఢీకొన్న కారు

● 8 మందికి తీవ్ర గాయాలు





కారు ఢీకొనడంతో బోల్తా పడ్డ ఆటో, క్షతగాత్రులను స్వయంగా తరలిస్తున్న సీఐ, కమిషనర్

మైదుకూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు సమీపంలోని అరోమా హోటల్ ఎదురుగా కడప-కర్నూలు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 మంది గాయపడ్డారు. కడప వైపు నుంచి స్థానిక సరస్వతిపేటకు చెందిన కూలీలతో వస్తున్న ఆటోను వెనకవైపు నుంచి కారుఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న సీఐ రమణారెడ్డి, కమిషనర్ రంగస్వామిలు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108లో మైదుకూరు ఆసుపత్రికి తరలించడంలో సహాయపడ్డారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కడప, ప్రొద్దుటూరుకు తరలించినట్లు వైద్యులు డాక్టర్ కరీముల్లా తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

నాన్ బెయిలబుల్ వారెంటు ఉన్న వ్యక్తి అరెస్టు

చెన్నూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చెన్నూరుకు చెందిన గంధం నాగరాజు ఆలియాస్ చిలక అనే వ్యక్తిపై నాన్ బెయిలబుల్ వారెంటు ఉండటంతో బుధవారం అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ క్రిష్ణారెడ్డి తెలిపారు. చెన్నూరు కొత్త రోడ్డు సరస్వతీ నగర్‌కు చెందిన నాగరాజు 2001లో జరిగిన ఓ హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఇతనిపై నాన్‌బెయిలబుల్ వారంటు ఉన్నా తప్పించుకుని తిరగడంతో బుధవారం అతనిపై నిఘా పెట్టి ఇంటి వద్ద అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

లావనూరులో కొండచిలువ కలకలం

కొండాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లావనూరు ఎస్సీ కాలనీలో బుధవారం కొండచిలువ కలకలం రేపింది. స్థానికంగా ఆదినారాయణ అనే వ్యక్తి ఇంటి సమీపంలో స్థానికులు కొండచిలువను గమనించారు. వెంటనే పాములు పట్టే వ్యక్తిని పిలిపించి పట్టుకున్నారు. అనంతరం కొండచిలువను ఫారెస్టు అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. వారం రోజుల కిందట పాత కొండాపురం గ్రామంలో కొండచిలువ కోడిని పట్టుకొని చంపుతుండగా స్థానికులు గమనించి చంపేశారు.

నేటి నుంచి కాశినాయన ఆరాధనోత్సవాలు



జ్యోతి క్షేత్రంలో ఏర్పాటు చేసిన స్వాగత తోరణం



అన్నదానం (వంటకు)కు ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

కాశినాయన, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరికుంట్ల సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలోని జ్యోతీ క్షేత్రంలో గురువారం నుంచి కాశినాయన 30వ ఆరాధనోత్సవాలు ప్రారంభమవు తాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. రెండురోజుల పాటు సాగే ఈ ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. అన్నదానం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు భక్తులను ఆకట్టుకునేలా ఉన్నాయి.

35 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

ఈ ఆరాధనోత్సవాలకు మైదుకూరు డిపోకు చెందిన 25 బస్సులు, గిద్దలూరు డిపో నుంచి 10 బస్సులు నడపనున్నట్లు మైదుకూరు డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ విజయమ్మ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం గురు, శుక్రవారాల్లో మైదుకూరు, పోరుమామిళ్ల, గిద్దలూరు నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతామన్నారు. కాగా, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో 150 మందితో పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోరుమామిళ్ల సీఐ హేమసుందర్‌రావు, ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. ఇందులో 6 మంది ఎస్ఐలు, ముగ్గురు సీఐలు, 119 మంది పోలీసులు, 8 మంది మహిళా పోలీసులు, 14 మంది స్పెషల్ పార్టీ పోలీసులు ఉంటారన్నారు. ఇక మండల వైద్యాధికారులు డాక్టర్, ప్రశాంతి, డాక్టర్ పుష్ప ఆధ్వర్యంలో 5 మంది వైద్య ఆరోగ్య సిబ్బందితో ప్రత్యేక వైద్యశిరం ఏర్పాటు చేస్తున్నట్లు వైద్య ఆరోగ్య విస్తరణా ధికారి బాలయ్య తెలిపారు.

6 నుంచి బ్రౌన్ గ్రంథాలయ వారోత్సవాలు

కడప కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీపీబ్రౌన్ 142వ వర్ధంతి (డిసెంబరు 12)ని పురస్కరించుకుని స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈనెల 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు బ్రౌన్ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. అందులో భాగంగా 6వ తేదీ ఉదయం 9 గంటలకు 6, 7, 8, తరగుతుల విద్యార్థులకు పద్యపఠనం (వేమన, సుమతి శతకాలలోని 6పద్యాలు.. ప్రతీ శతకం నుంచి మూడు పద్యాలు ఉండాలన్నారు. 7వ తేదీ ఉదయం 9 గంటలకు 9, 10 తరగుతుల విద్యార్థులకు బ్రౌన్ జీవితం-సాహిత్యం అనే అంశంపై వక్తృత్వం పోటీలు, 8వ తేదీ 3, 4, 5, తరగతుల విద్యార్థులకు చిత్రలేఖనం, 9వ తేదీ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ధారణ పరీక్ష (అంశం రామాయణ, భారత, భాగవతాలలోని విషయాలు)ఉంటుందన్నారు. 10వ తేదీ 8, 9, 10 తరగతుల వారికి కథాపురాణం, 11వ తేదీ 8, 9, 10 తరగతుల విద్యార్థులకు క్విజ్ (కడప జిల్లాకు చెందిన వైజ్ఞానిక అంశాలపై) పోటీలు ఉంటాయన్నారు. 12వ తేదీ శుక్రవారం సాయంత్రం 5 గంటలకు జరిగే ముగింపు సమా వేశంలో విజేతలకు బహుమతుల ప్రదానం జరుగుతుందన్నారు.

62 స్కూల్‌వ్యాన్లు తనిఖీ

సీకేదిన్నె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాహనాల తనిఖీల్లో భాగంగా జిల్లాలో 62 పాఠశాల బస్సులను తనిఖీ చేసినట్లు ఇన్‌చార్జి డీటీసీ వీర్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల బస్సు ప్రమాదం జరిగిన నేపథ్యంలో ప్రత్యేకంగా చేపట్టిన స్కూలు వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా కడప డివిజన్‌లో 22 బస్సులను తనిఖీ చేయగా 10 కండీషన్‌లో ఉన్నాయని, బద్వేలు డివిజన్‌లో ఆరు చెక్ చేయగా అయిదు బస్సులు మంచి కండీషన్‌లో ఉన్నాయన్నారు. పులివెందులలో ఆరు బస్సులకు గాను నాలుగు, ప్రొద్దుటూరులో 28 బస్సులుకు 19 కండీషన్‌లో ఉన్నాయన్నారు. మొత్తం 62 పాఠశాల వాహనాలను రవాణా శాఖ అధికారులు తనిఖీ చేయగా 38 కండీషన్‌లో ఉండగా, కండీషన్‌లో లేని 24 బస్సుల యజమానులకు నోటీసులు అందించినట్లు తెలిపారు. పాఠశాల వాహనాల యజమానులు బస్సులను ఎప్పటికప్పుడు కండీషన్‌లో ఉంచుకోవాలని, విద్యార్థుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

సిగటోక ఆకుమచ్చ తెగులుపై శిక్షణ

సింహాద్రిపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో ని గురిజాల, బలపనూరు గ్రామాల్లో బుధవారం అరటిలో సిగటోక ఆకుమచ్చ తెగులుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అరటి పరిశోధన శాస్త్రవేత్త శిరీష మాట్లాడుతూ డిసెంబరులో చలి తీవ్రత, గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉండడంతో సిగటోక తెగులు వ్యాప్తి అయ్యే అవకాశం ఉందన్నారు. తెగులు ప్రారంభ దశలో మంకోజెబ్ లేదా క్లోరోతలోనిల్ ఒక లీటర్ నీటికి రెండు గ్రాముల చొప్పున పిచికారీ చేయాలన్నారు. 15 రోజుల తర్వాత ప్రొపైకొనాజోల్ ఒక లీటర్ నీటికి ఒక మిల్లీ లీటర్ పిచికారి చేసుకోవాలన్నారు. గెల వేసిన తర్వాత ఆజాక్షి స్ట్రోబిన్+డైఫెనాకొనాజోల్ ఒక లీటర్ నీటికి ఒక మిల్లీ లీటర్ పిచికారీ చేసుకోవాలన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి సతీష్, సూక్ష్మనీటి శాఖ పీడీ వెంకటేశ్వరరెడ్డి, ఉద్యాన శాఖ అధికారి మల్లేశ్వరరెడ్డి, ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు దరఖాస్తులు

చెన్నూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్షసంయుక్త ఆధ్వర్యంలో మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసేందకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి డి.గంగిరెడ్డి తెలిపారు. ఈనెల 5లోగా దరఖాస్తులను మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో అం దించాలని కోరారు. స్కూలు అసిస్టెంటు ఫిజికల్ సైన్స్ పోస్టు ఖాళీగా ఉందని.. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు రామనపల్లె హైస్కూలు విద్యార్థులు



చెన్నూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామ నపల్లెకు చెందిన నాగచైతన్య అనే విద్యార్థి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కర్నూలు జిల్లా ఎమ్మి గనూరులో నవంబరు 29, 30 తేదీల్లో స్కూలు గేమ్ ఫెడరే షన్ అండర్19 రాష్ట్రస్థాయి పోటీల్లో 13 జిల్లాలకు చెందిన బాలబాలికలు కత్తిసాము పోటీల్లో పాల్గొన్నారు. అందులో ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లా నుంచి రామనపల్లె హస్కూ లు విద్యార్థి నాగచైతన్య ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థి 2026 జనవరి రెండో వారంలో పంజాబ్ రాష్ట్రం లూధియానలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు. అలాగే గత నెల 20, 30 తేదీల్లో విజయవాడ గన్నవరంలో జరిగిన స్కూలు గేమ ఫెడరేషన్ అండర్ 14 రగ్బీ రాష్ట్రస్థాయి పోటీల్లో రామనపల్లె హైస్కూలు విద్యార్థి కమాల్‌బాషా మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. వీరిద్దరిని ఆ పాఠశాల హెచ్‌ఎం ఉమాదేవి, ఫిజికల్ డైరెక్టరు గణేశ్‌బాబులు అభినందించారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు బయనపల్లె విద్యార్థినులు



సీకేదిన్నె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు బయనపల్లె వెంకటేశ్వర ఉన్నత పాఠశాల విద్యార్థిని తుమ్మల కావ్య ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు దేవదయాల్, వ్యాయామ ఉపాధ్యాయుడు పవన్‌కుమార్‌లు తెలిపారు. విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో జరిగిన 19వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపరచి జాతీయస్థాయికి ఎంపికైందన్నారు. అదే విధంగా అండర్-17 ఖోఖో బాలికల విభాగంలో విజయనగరంలో జరిగిన పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఉప్పు చైత్ర, కె.సుహాసిని మంచి ప్రతిభ కనపరిచినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

రాష్ట్ర స్థాయి క్విజ్‌కు చిలమకూరు విద్యార్థినులు



ఎర్రగుంట్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిలమకూరు జడ్పీహైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న పి.సింధుప్రియ రాష్ట్రస్థాయి కౌశల్‌సైన్స్ క్విజ్‌పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం పద్మనాభం తెలిపారు. అలాగే డి.దీపిక కౌశల్‌రీల్స్‌కి ఎంపికైందన్నారు. తిరుపతిలో డిసెంబరు 27న జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరిగే రాష్ట్రస్థాయి కౌశల్ క్విజ్ పోటీల్లో పాల్గొంటారన్నా రు. విద్యార్థుల ఎంపికపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

CHANGE OF NAME

I, ELLALA ARSHIYA (OLD NAME) WIO ELLALA IBRAHEEM., RESIDENT OF 1/295, SOCIETY COLONY, KHAJIPET, YSR DIST. I HAVE CHANGED MY NAME AS ELLALA ARSHIA BEGUM (NEW NAME) W/O ELLALA IBRAHEEM HENCE FORTH I MAY BE CALLED AS ELLALA ARSHIA BEGUM FOR ALL PURPOSES.
AJC-000

LOSS OF PASSPORT

I, Thammisetty Prasad, S/o Thammisetty Srinivasulu, residing at D.No.000, Patimeeda Palle, Ravulapalle, kadapa, YSR district, A.P., MY Passport Bearing No: X1058973, Issued 08/10/2024 at Kuwait, has been lost at Khajipeta Bustand Xerox center. If found, pls contact above.
AJC-000

CHANGE OF NAME

I, LAKSHMI VASUNDHARA (Old name), resident of D.No: 9-477 E-1, Near Chowdeswari Temple, Yarraballi, Rajampet Town & Mandal, Annamayya District, A.P., here by Declare that my name is corrected as RAVINUTHALA LAKSHIMI (New name), W/O RAVINUTHALA PHANEENDRA RAO
AJC-000

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిజిస్టర్డ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 257593

బిజినెస్ ఆఫర్

తక్షణం వ్యాపార భాగస్వాములు వెతుకుతున్నాము. అవకాశాన్ని కొల్పోకండి. సంప్రదించండి. RSJ Inspection Service Ltd. Cell:8595924917,8800629648
AJA-257588

కావలెను

10 తరగతి చదివిన సం. 25-30 వయస్సు ఉన్న అటెండర్ కావలెను. రోజు + నెలకు + బహుమతులు ఉంటాయి. సంప్రదించండి : AVS Chandra Reddy, UTI Mutual Fund / UTIITSL IT Pancard, 21-10, Gunta Bazar Led ప్రక్కన, Tirumala Hospital, R.S.Road, Kadapa.
Ajc-000

10th,ఇంటర్,డిగ్రీ పాసయ్యే ఛాన్స్

చదువు మధ్యలో ఆపేసిన (లేదా) ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, డిగ్రీ పాసయ్యే ఛాన్స్ కలదు. కడప సెల్: 90105 01122.
AJC-258911

CHANGE OF NAME

I SHAIK MOHAMMED JOFAS (OLD NAME) D.NO.8/978-3, VAKKAL PET SAIPET, KADAPA YSR DIST AP. HERE CHANGE MY NAME AS SHAIK ABDUL RAZAK (NEW NAME) SO SHAIK MOHAMMED SAMAD. HENCEFORTH I MAY BE KNOWN AS SHAIK ABDUL RAZAK.
AJC-258573

పాస్‌పోర్టు పోయినది

తుపాకుల వెంకటేష్ తండ్రి తుపాకుల ఓబులేసు, D.No. 2/574, శివాలయం వీధి, రాజంపేట టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్, పాస్‌పోర్టు నెం. S4740696, మా ఇంటి నుండి జిరాక్స్ నిమిత్తం రాజంపేట బస్టాండ్‌కు బైకులో వెళ్తుండగా పోయినది. దొరికినవారు అందజేయగలరు. సెల్ : 91336 63356
Ajc-000

LOSS OF PASSPORT

I, CHAPPIDI JYOTHSNA DEVI, D/o CHAPPIDI VENKATA SESHAIAH, D.No. 1/44, BaluPalle, Papasahebpet, C.K. dinne (m), YSR Kadapa dist, A.P., The said Passport was Lost by me.While I went to take xerox centre at RTO office circle C.K.dinne (m), YSR Kadapa dist, MY Passport No: V4291539, If any found, contact above Address.
AJC-258911

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెనగలూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగరాజపురం, నల్లపురెడ్డిపల్లె, కట్టవారిపల్లె ఉన్నత పాఠశాలలతో పాటు కొండూరు ప్రాథమిక పాఠశాలలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో-1 గిరివరదయ్య తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 5లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నర్సింగరాజపురం ఉన్నత పాఠశాలలో తెలుగు స్కూల్ అసిస్టెంట్ ఒకటి, నల్లపురెడ్డిపల్లె, కట్టవారిపల్లె, కొండూరు ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కొక్కటి చొప్పున సెకండరీ గ్రేడ్ పోస్టులు ఉన్నాయన్నారు. స్కూల్ అసిస్టెంట్‌కు దరఖాస్తు చేసుకునే వారు బీఈడీ పూర్తి చేసి టెట్ అర్హత కలిగి ఉండాలన్నారు. అలాగే సెకండరీ గ్రేడ్ పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారు ఇంటర్మీడియట్ తర్వాత టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసి టెట్ అర్హత కలిగి ఉండాలన్నారు. స్కూల్ అసిస్టెంట్‌కు రూ.12500, సెకండరీ గ్రేడ్ అసిస్టెంట్‌కు రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తారన్నారు.

చిట్వేలి మండలంలో..

చిట్వేలి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లోని 9ఎస్‌జీటీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో ఖాజామొహిద్దీన్ తెలియజేశారు. మండలంలోని మాలేమార్పురం, చెన్నమరాజుపోడు, గట్టుమీదపల్లె, చెర్లోపల్లె, తుమ్మకొండ అగ్రహారం, నీఎం రాచపల్లె ఎంపీపీ పాఠశాల, కె.కందులవారిపల్లె, వెంకటరాజుపల్లె, నాగవరం ఉన్నత పాఠశాలల్లో ఒక్కొక్క ఎస్‌జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన తెలిపారు.

నందలూరు మండలంలో..

నందలూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్జీటీ, నందలూరు జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్రం(ఉర్దూ), జీవశాస్త్రం(ఉర్దూ) ఉపాధ్యాయులుగా పని చేయుటకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవోలు ఎల్.నాగయ్య, అనంతకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ స్థానిక ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తులను అందించాలని సూచించారు.

గాలివీడు మండలంలో..

గాలివీడు, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు పాఠశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేయుటకు అకడమిక్ ఇన్స్ట్రక్టర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవోలు నాగరాజు, శ్రీనివాసరాజు తెలిపారు. గాండ్లపల్లి, తూముకుంట హైస్కూల్, చావిడిపల్లి మోడల్ ప్రైమరీ స్కూళ్లకు ఒక్కొక్క ఎస్‌జీటీ పోస్టు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఈనెల 5వ తేదీలోపు ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తులను అందించాలని సూచించారు.

వైసీపీ నేతపై దాడి

రాయచోటి టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని ఎన్జీవో కాలనీలో నివాసముంటున్న వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్‌పై బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పోలీసుల కథనం మేరకు.. స్థానిక ఎన్జీవో కాలనీలో ఉంటున్న విజయభాస్కర్ వైసీపీలో చురుకుగా వ్యవహరిస్తున్నారని, ఇటీవల ప్రభుత్వ కార్యక్రమాలకు వ్యతిరేకంగా ఆయన ప్రకటనలు చేస్తూ ప్రశ్నిస్తున్న నేపథ్యంలో సుమారు పదిమంది గుర్తు తెలియని దుండగులు కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచి పరారయ్యారన్నారు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే విజయభాస్కర్‌ను ఏరియా ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డిప్యూటీ ఎంపీడీవోగా శ్రీనాథ్

పెనగలూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పెనగలూరు మండలం డిప్యూటీ ఎంపీడీవోగా బుధవారం కేవీ శ్రీనాథ్ బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని పంచాయతీరాజ్ విజిలెన్స్‌శాఖలో విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై పెనగలూరు డిప్యూటీ ఎంపీడీవోగా వచ్చినట్లు ఆయన తెలిపారు.

మహారాజశ్రీ మూడవ అదనపు జిల్లా జడ్జి కోర్టు, రాజంపేట

E.P. No. 49/2019 in O.S. No. 20/2017

... అన్నమయ్య జిల్లా - D.Hr

V/s

... అన్నమయ్య జిల్లా ... J.Dr.

... EP ... SCHEDULE : Item No.1 S.No. 637 ... Ac. 1.77 ... Market Value Rs. 5,50,000/-, Item No.4 : S.No. 11 99-2 ... Ac.0.37 Cents ... Market Value Rs. 1,10,000/-, Item No. 5, S.No. 11 97-B, ... Ac 0.54 1/2 Cents ... Market Value 1,62,000/-, DHR Value : 24,22,000, Ameena Value : 33,31,000

... DHr Advocate, Rajampet



ప్రాధాన్యతా రంగాలకు ఇచ్చే రుణాలపై దృష్టి సారించాలి

● కలెక్టర్ నిశాంత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి(నేతాజీ సర్కిల్), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బ్యాంకులు ప్రాధాన్యత రంగాలకు ఇచ్చే రుణాలపై దృష్టి సారించాలని, అలాగే వ్యవసాయం, ఉద్యాన పంటలు, పశుసంవర్థక రుణాలను ఎక్కువగా మంజూరు చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని మీడియా కాన్ఫరెన్స్ హాల్‌లో లీడ్ డిస్ట్రిక్ట్ బ్యాంక్ ఆధ్వర్యంలో వివిధ బ్యాంకులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా ఎల్డీయం అంజనేయులు సమావేశాన్ని ప్రారంభిస్తూ జిల్లాలోని బ్యాంకుల రుణాల మంజూరు, ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాలు, ప్రాధాన్యత రంగాలకు ఇవ్వాల్సిన రుణాలు, కరువు మండలాలకు చేయూత, తదితర అంశాలను కలెక్టర్‌కు, కమిటీ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొన్ని ప్రైవేటు బ్యాంకులు ప్రాధాన్యత రంగాలకు ఇవ్వాల్సిన రుణాల లక్ష్యాలు చేరుకోవడం లేదని, తప్పనిసరిగా ప్రాధాన్యత రంగాలకు ఇవ్వాల్సిన రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ఇల్లు కట్టుకోవడానికి చాలా మంది పేదలు బ్యాంకుల నుండి కాకుండా ప్రైవేటు వ్యక్తుల నుండి రుణాలు తీసుకోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బ్యాంకులు దీనిపై దృష్టి సారించాలని సూచించారు. ఈ నెల 17 నాటికి బ్యాంకులు తమ వద్దనున్న ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ ప్రోగ్రాం దరఖాస్తులను, ముద్ర యోజన, విశ్వకర్మ యోజన, ప్రధాన మంత్రి సూర్య బిజిలీ యోజన దరఖాస్తులను ప్రాసెస్ చేయాలని, ప్రధాన మంత్రి ధన ధాన్య కృషి యోజనలో రైతులకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు.

ఉద్యాన రైతులకు ఉజ్వల భవిత

● బద్వేల్ డివిజన్ ఉద్యాన అధికారి జయభరత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఉద్యాన అధికారి జయభరత్‌రెడ్డి

సిద్దవటం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉద్యాన రైతులకు ఉజ్వల భవిత ఉంటుందని బద్వేల్ డివిజన్ ఉద్యాన అధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బాకరాపేట రైతుసేవా కేంద్రంలో బుధవారం అన్నదాత సుఖీభవ-రైతన్నమీకోసం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి, అరటి పంటల్లో ఫ్రూట్‌కేర్ యాక్టివేట్ ద్వారా కవర్లు కట్టినందువల్ల నాణ్యత పెరిగి సాగు ఖర్చు తగ్గడమే కాకుండా రైతులకు రెట్టింపు ఆదాయం లభిస్తుందన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల పరిజ్ఞానాన్ని రైతులకు అందిస్తూ క్షేత్ర స్థాయిలో రైతుల సమస్యలు పరిష్కరించడానికి వారానికి రెండు రోజులు, రోజుకు రెండు గ్రామాలు చొప్పున ఖరీఫ్‌లో నాలుగు నెలలు, రబీలో నాలుగు నెలలు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సర్పంచ్ తుర్రా చిన్నక్క మాట్లాడుతూ ఉద్యాన, హార్టికల్చర్ ద్వారా ఆయిల్‌ఫామ్ పంటలు సాగు చేస్తే గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రతినిధి నాగం నరసింహారెడ్డి, అగ్రికల్చర్ ఏఈవో ప్రభాకర్‌రెడ్డి, ఉద్యానశాఖ శాస్త్రవేత్తలు, రైతులు, రైతుసేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పంటల సాగుకు ఆర్థిక సాయం : ఏడీ శ్రీలత



మాట్లాడుతున్న ఏడీ శ్రీలత

సుండుపల్లె, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పంటల సాగుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేసి రైతులకు అండగా నిలుస్తోందని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు (ఏడీ) శ్రీలత తెలిపారు. బుధవారం మండలంలోని ఈడిగపల్లి, మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీలో రైతన్న-మీకోసం వర్క్‌షాపు సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందన్నారు. రైతు సమస్యల పరిష్కారానికి రైతన్న-మీకోసం కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేశ్‌నాయుడు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్, టీడీపీ మండల అధ్యక్షుడు రమేశ్‌నాయుడు, జనసేన నేత రామాశ్రీనివాస్, వీర మహిళ రెడ్డిరాణి, తదితరులు పాల్గొన్నారు.

'మైనింగ్ అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరపాలి'

రాయచోటిటౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా మైనింగ్‌శాఖలో అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరపాలని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండు చేశారు. బుధవారం ఆయన స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ అక్రమంగా తరలిస్తున్న మట్టి, ఇసుక, రాయి తవ్వకాల వల్ల ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతింటున్నాయన్నారు. అక్రమ మైనింగ్‌తో ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం వాటిల్లితున్నా అధికారులు కనీస చర్యలు కూడా తీసుకోకపోవడం బాధాకరమన్నారు. గ్రామాల వద్ద రాత్రివేళ జరుగుతున్న అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు పోలీసు- మైన్ శాఖలు సంయుక్త దళాలను ఏర్పాటు చేయాలన్నారు. అక్రమ మైనింగ్ వల్ల పాడైపోయిన రహదారులు, నీటి వనరులు, వ్యవసాయ భూములను ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని, మైనింగ్ అనుమతులను రద్దు చేసి స్థానిక ప్రజల అభిప్రాయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి జగన్‌బాబు, ఆంజనేయులు, పవన్ పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేయాలి

చిన్నమండెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయి నుండి తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం కలికట్టుగా కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మూగి రెడ్డెప్ప అన్నారు. బుధవారం చాకిబండ గ్రామ పంచాయతీలో గ్రామస్థాయి టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వర్గ విబేధాలు లేకుండా పార్టీ పటిష్టత కోసం కలిసి పనిచేద్దామని సూచించారు. అలాగే న్యాయబద్ధంగా ఉన్న సమస్యలేవైనా ఉంటే మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

రికార్డులు లేని వాహనాలపై చర్యలు

చిన్నమండెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రికార్డులు లేని వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. మండల కేంద్రంలోని కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై పోలీస్‌స్టేషన్ ఎదురుగా బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం రికార్డులు లేని, హెల్మెట్ లేని వాహనదారులకు జరిమానా విధించారు.

నిరుద్యోగులకు వరం స్కిల్ హబ్

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు స్కిల్ హబ్ వరంలాంటిదని జిల్లా వృత్తి నైపుణ్యత అధికారి మేరు నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. జిల్లాలో ఉన్న వనరులు, డిమాండును దృష్టిలో పెట్టుకొని యువతకి మూడు నెలల పాటు నైపుణ్య శిక్షణ ఇచ్చి స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో, ఇతర రాష్ట్రాల్లో కూడా ఉపాధి అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నిరుద్యోగులను నిరాశపరచిన కౌశల్ ఆన్‌లైన్ పరీక్ష

పెనగలూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన కౌశల్ ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష మండల నిరుద్యోగులను నిరాశపరిచింది. ప్రభుత్వం గత నెలలో అర్హత పరీక్ష నిర్వహించగా అందులో ఉత్తీర్ణులైనవారికి మరో అర్హత పరీక్షను బుధవారం మండలవ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల్లో నిర్వహించింది. కంప్యూటర్ల వసతి ప్రకారం ఉదయం కొందరికి, మధ్యాహ్నం కొందరికి ఈ పరీక్ష జరిగింది. వర్క్ ఫ్రం హోమ్ ఉద్యోగానికి అర్హత సాధించేందుకు నిరుద్యోగులు ఎంతో ఆశతో ఆతృతతో సచివాలయాల వద్దకు చేరుకున్నారు. అయితే వారం రోజుల నుంచి వాతావరణంలో పూర్తిగా మార్పులు వచ్చి రోజంతా చిరుజల్లులు కురుస్తూ ఉండడంతో ఇంటర్నెట్ సౌకర్యం పూర్తిగా స్తంభించిపోయింది. నెట్‌వర్క్ సమస్య కారణంగా పరీక్ష బాగా రాలేకపోయామని చాలామంది నిరుద్యోగులు వాపోయారు. మరికొంతమందికి మాత్రం 15నిముషాలు, అరగంట ఇలా ఒక్కో సచివాలయంలో ఒక్కో విధంగా ఇంటర్నెట్ సౌకర్యం రావడంతో ఆ కొంత సమయాన్ని వినియోగించుకుని 30శాతం, 50శాతం ప్రశ్నలకు సమాధానాలు గుర్తించినట్లు కొందరు చెబుతున్నారు. ప్రభుత్వం సమస్యను గుర్తించి నిరుద్యోగుల ఆశలు అడియాశలు కాకుండా వాతావరణం బాగా అనుకూలించినప్పుడు మరోసారి కౌశలం ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించాలని నిరుద్యోగులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో విజయరావును వివరణ కోరగా మండల వ్యాప్తంగా కౌశలం ఆన్‌లైన్ పరీక్ష జరిగిన మాట వాస్తవమేనని, కానీ ఎంతమంది నిరుద్యోగులు హాజరైంది తన లాగిన్‌లోకి రాలేదని తెలిపారు.

వినూత్న సంస్కరణలు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి



మెగా జాబ్‌మేళాలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో వినూత్న సంస్కరణలు తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సాయి ఇంజనీరింగ్ కళాశాలలో మెప్మా నిపుణ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పారిశ్రామిక ప్రగతికి ఊతమిచ్చే అనేక పరిశ్రమలను స్థాపించి ప్రభుత్వం యువతకు విస్తృతమైన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందన్నారు. డీఆర్‌వో మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఈ మెగా జాబ్‌మేళాలో సుమారు 15కంపెనీలు పాల్గొన్నాయని, మొత్తం 600 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. అనంతరం ఎంపికైన 270 మందికి ఆయా కంపెనీల ఆఫర్ లెటర్లు అందించారు. కార్యక్రమంలో రాయచోటి మున్సిపల్ కమిషనర్ రవి, నిపుణ ఆపరేషన్ మేనేజర్ కార్తీక్, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీదేవి, డీపీఎంయూ మెప్మా సిబ్బంది, రాయచోటి, రాజంపేట, మదనపల్లి పురపాలక మెప్మా విభాగాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

ఒంటిమిట్ట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) 18వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నరసయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన ఒంటిమిట్టలో సీఐటీయూ నాయకులతో కలిసి మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాలు 8 గంటల పనిని 13 గంటలకు పెంచడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సురేశ్‌బాబు, ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, సుబ్బరాయుడు, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.


రాజంపేటను జిల్లా కేంద్రంగా సాధిద్దాం

● పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ

సిద్దవటం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేటను సాధించుకోవడం తప్ప మరోమార్గం లేదని రాజంపేట జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ తెలిపారు. మండలంలోని మాధవరంలోని బంగారుపేట వద్ద బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా రాజంపేట అనువైన ప్రాంతమన్నారు. రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటిస్తామని ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఇచ్చిన హామీని గుర్తు చేశారు. ఆ వాగ్దానం అమలు చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కూటమి నేతలు పాల్గొన్నారు.

ఐసీటీసీ వాహనాల సేవలు మెరుగుపరుస్తాం

● డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనర్సయ్య



రాయచోటి(నేతాజీ సర్కిల్), డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): దూర ప్రాంతాల ప్రజలకు హెచ్‌ఐవీ ఎయిడ్స్ సేవలందించేందుకు మొబైల్ ఇంటిగ్రేటెడ్ కౌన్సిలర్, టెస్టింగ్ సెంటర్ ఐసీటీసీ వాహన సేవలను మెరుగుపరుస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లక్ష్మీనర్సయ్య తెలిపారు. బుధవారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో కొత్త సంచార, ఐసీటీసీ వాహన సేవ వాహనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మధుసూదన్‌రెడ్డి, డీఎస్ఎంవో విష్ణువర్థన్‌రెడ్డి, పీసీఎస్ఎస్ ప్రాజెక్టు మేనేజర్ స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటలతో అదనపు ఆదాయం



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎస్.మణి

రైల్వేకోడూరురూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మామిడి, అరటి తోటల్లో అంతర పంటలు సాగు చేసి అదనపు ఆదాయం పొందాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎస్.మణి తెలిపారు. బుధవారం మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అధిక మోతాదులో ఎరువులు ఉపయోగించరాదని, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని సూచించారు. ప్రకృతిసిద్ధంగా లభించే ఎరువులు, వేపాకు, జీవన ఎరువులను వాడాలన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు సూచించిన ఐదు సూత్రాలను వివరించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి భాస్కర్, వ్యవసాయశాఖాధికారి సందీప్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం పెంచే ప్రణాళికలు సిద్ధం చేయండి

రామాపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రబీ సీజన్‌లో పంట సాగులపై రైతులకు ఆదాయం పెరిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని మండల వ్యవసాయ అధికారి నాగమణి సూచించారు. మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతన్న-మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పనిముట్లు గురించి చర్చించారు. ఇరిగేషన్ ఇంజనీర్ మహబూబ్‌బాషా జలధార పథకంపై రైతులకు పూడికతీత గురించి వివరించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, ఏఎస్‌వో నాగసుబ్బరాయుడు, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గాలివీడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పూలుకుంట సర్పంచ్ పార్థసారధిరెడ్డి అన్నారు. బుధవారం పూలుకుంట రైతు సేవా కేంద్రంలో రైతన్న-మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, మిగిలిన వారికి 90 శాతం సబ్సిడీతో డ్రిప్పు, స్ప్రింక్లర్లు అందిస్తూ సూక్ష్మ, బిందుసేద్యాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ సహాయకుడు వినోద్‌కుమార్, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, కొండారెడ్డి, గోపాలయ్య, ఎఫ్ఏలు మహేశ్వర్‌రెడ్డి, వీరాంజనేయులు, పట్టు, ప్రకృతి వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పంచసూత్రాలు పాటించాలి

రాయచోటి(నేతాజీ సర్కిల్), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అవలంబిస్తున్న పంచ సూత్రాలు పాటించాలని రాష్ట్ర పాల ఎకరీ కార్పోరేషన్ చైర్మెన్ నాగేశ్వర్‌నాయుడు, సంబేపల్లె మండల వ్యవసాయశాఖ అధికారి కిశోర్‌నాయక్ తెలిపారు. బుధవారం సంబేపల్లె రైతు సేవా కేంద్రంలో రైతులతో రైతన్న-మీకోసం వర్క్‌షాప్ నిర్వహించారు. లాభసాటి వ్యవసాయమే లక్ష్యంగా రైతుల అభిప్రాయాల సేకరణకు ఈ వర్క్‌షాపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నీటి లభ్యత, ఆదాయ ఆధారిత పంటల సాగు, సాగు ఖర్చు తగ్గించి ఆదాయం పెంచే పంటలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నందలూరు మండలంలో రైతన్న-మీకోసం..

నందలూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకినేనిపల్లె, లేబాక, నందలూరు, ఆడపూరు రైతుసేవా కేంద్రాల్లో బుధవారం రైతన్న-మీకోసం వర్క్‌షాపు కార్యక్రమం నిర్వహించారు. పంచశీల సూత్రాలను, రాబోయే మూడు సీజన్లలో చేపట్టే కార్యక్రమాలు, యూరియా వినియోగించే విధానం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మల్లికార్జున, టీడీపీ మండల అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, ఏపీఎం శ్రీనివాసులు, వెటర్నరీ వైద్యురాలు డాక్టర్ మాధవీలత, తెలుగుదేశంపార్టీ మండల జనరల్ సెక్రటరీ గొబ్బిళ్ల సుబ్బరాయుడు, మార్కెట్‌కమిటీ మాజీ వైస్ ప్రెసిడెంట్ తాటి సుబ్బరాయుడు, ఐటీడీపీ ప్రెసిడెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ఎరువులు వాడితే లాభదాయకం

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రకృతి ఎరువులు వాడితే పంటలకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయ సహాయ సంచాలకులు జయరాణి అన్నారు. రైతన్న-మీకోసం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమర్థవంతమైన వ్యవసాయ పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. సాగుకు ముందు విత్తనశుద్ధి, సాగునీటి నిర్వహణపై సూచనలు పాటించాలన్నారు. ఉద్యానశాఖ అధికారి సింధు మాట్లాడుతూ తక్కువ నీటితో బిందు సేద్యం ద్వారా మామిడి తోటలను బ్రతికించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ షఫీనాయక్, వ్యవసాయ అధికారి రాజకుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్నాం

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో రైతులకు, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్నామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో మంత్రి స్వగృహంలో ప్రజాదర్బార్‌లో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి పలువురు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రిని పలువురు నాయకులు దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రాజంపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. బుధవారం రాజంపట మండలం హస్తవరంలో ఏర్పాటు చేసిన రైతన్న-మీకోసం వర్క్‌షాపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసమే ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఏవో నాగలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్యానాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు మేడికొండ రవికుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఉన్నవారైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

రాజంపేట - A.C.O.: 99854 11312 | రాయచోటి - A.C.O.: 63006 38887 | రాయచోటి - S.R.: 99858 65573 | రైల్వేకోడూరు - S.R.: 98854 12462 | D.C.M.: 99854 11184



అందని మిషన్... ఆగిన కుట్టు

● పూర్తయిన శిక్షణ ● ఉచిత కుట్టుమిషన్ల కోసం మహిళలు
● వేతనాల కోసం ట్రైనర్లు ● నెలల తరబడి ఎదురు చూపులు



శిక్షణ తీసుకుంటున్న మహిళలు (ఫైల్)

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళల ఆర్థిక స్వావలంబన చర్యలు తీసుకోవడంలో భాగంగా కుట్టుశిక్షణతో వారికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో మహిళ దినోత్సవం రోజున కుట్టుశిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ కుట్టుశిక్షణ కేంద్రాలకు తగినన్ని నిధులు లేకపోవడంతో అవి బాలారిష్టాలను నడుమ కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో శిక్షణ కేంద్రాలను తాత్కాలికంగా మూసివేసినట్లు తెలుస్తుంది. మహిళలకు కుట్టుశిక్షణ ఇచ్చి డిమాండ్‌లో ఉన్న వివిధ రకాల దుస్తుల తయారీలో మెళకువలు నేర్పించేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 24 శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా శిక్షణ పొందేందుకు వివిధ ప్రాంతాల్లోని అర్హులైన 15594 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో తొలి విడతగా 3068 మందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ఎక్కడ కూడా అక్రమాలు చోటు చేసుకోకుండా శిక్షణ కార్యక్రమాలను పారదర్శకంగా సాగే విధంగా చర్యలు తీసుకున్నారు. శిక్షణకు హాజరైన వారందరికీ డిజిటల్ అటెండెన్స్ ద్వారా హాజరు నమోదు చేయడం జరిగింది.90 రోజుల పాటు ఇచ్చే కుట్టుశిక్షణకు 75శాతం హాజరైన వారికి ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేస్తామని ప్రకటించారు. ఈ క్రమంలోజిల్లాలోని అన్నిశిక్షణ కేంద్రాల్లో 90 రోజులపాటు శిక్షణ కొనసాగింది. ఇందులో 70 రోజుల పాటు ఆసక్తిగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు ఇవ్వాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు ఒకరికి కూడా కుట్టుమిషన్ అందించిన పరిస్థితి లేదు. అంతేకాకుండా కుట్టుశిక్షణ పొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు కూడా ఇవ్వకపోవడంతో వేలాది మంది మహిళలు కుట్టుమిషన్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి.

ఆగిన కుట్టుశిక్షణ

ప్రభుత్వం కుట్టుశిక్షణతో పాటు ఉచితంగా కుట్టుమిషన్లు ఇస్తామనడంతో జిల్లాలో వేలాది మంది కుట్టుశిక్షణ తీసుకునేందుకు ఆసక్తి చూపారు. ఒకసారి శిక్షణ తీసుకుంటే కుట్టుమిషను ద్వారా స్వయం ఉపాధి పొంది కుటుంబానికి ఆర్థికంగా ఆదరువుగా నిలవాలనేది వారి ఉద్దేశ్యం. అంతేకాకుండా ఇంట్లో పనిచేసుకుంటూ కుట్టుమిషన్ల ద్వారా మరింత మెరుగైన జీవనోపాధులను పొందవచ్చని ఆశించారు. ఈ కారణంగానే కుట్టుశిక్షణ పొందడం కోసం జిల్లాలో 15594 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇప్పటి వరకు 3068 మందికి మాత్రమే శిక్షణ ఇచ్చారు. మిగిలిన వారికి మరోవిడతలో శిక్షణ ఇచ్చే విధంగా జిల్లా అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది. కానీ తొలివిడ తలో శిక్షణ పొందిన వారికే ఉచిత కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు ఇప్పటి వరకు ఇవ్వకపో వడం గమనార్హం.

కుట్టు శిక్షణ కేంద్రాల మూసివేత

ప్రస్తుతానికి కుట్టుశిక్షణ కేంద్రాలను మూసివేసినట్లు తెలుస్తోంది. కేవలం శిక్షణకు అభ్యర్థులను ఎంపిక చేయడం, శిక్షణ నిర్వహణను పర్యవేక్షించడం వరకే అధికార యంత్రాంగం బాధ్యతగా తెలుస్తోంది. శిక్షణ కేంద్రాల ఏర్పాటు, ట్రైనర్ల ఎంపిక, వేతనాల చెల్లింపు, ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ బాధ్యతలను ప్రభుత్వం ఒక ప్రైవేటు కాంట్రా క్టర్‌కు అప్పగించింది. మొదటి విడతకు సంబంధించిన బిల్లులు పెండింగులో ఉన్నాయంటూ శిక్షణ కార్యక్రమాలను ఆపివేశారు. దీంతో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు కుట్టుమిషన్ల కోసం, శిక్షణ ఇచ్చిన ట్రైనర్లు వేతనాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఈ విషయమై బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్.జయసింహను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా... మొదటి విడత శిక్షణ అయిపోయిందన్నారు. ఆ తరువాత ప్రభుత్వం నుంచి తగిన ఆదేశాలు వచ్చిన వెంటనే ప్రభుత్వ నిర్ణయం మేరకు మిగిలిన వారికి కుట్టుశిక్షణ ఇచ్చే కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివనారాయణ



మాట్లాడుతున్న డీఏవో శివనారాయణ

పీలేరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివనారాయణ పేర్కొన్నారు. బోడుమల్లువారిపల్లె సచివాలయంలో బుధవారం జరిగిన రైతన్నా.. మీ కోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతన్నలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం చంద్రబాబు ప్రభుత్వం తీసుకువచ్చిన వినూత్న పరిష్కార మార్గమే రైతన్నా మీ కోసం కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం తరపున రైతన్నలకు అందుతున్న సాయం, ప్రోత్సాహకాలను ఇంటింటికీ తిరిగి తెలియజేస్తున్నారన్నారు. అదే సమయంలో వారికి దక్కాల్సిన రుణాలు, సబ్సిడీలు, పంట ఇన్సూరెన్సు తదితర అంశాల గురించి వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నామన్నారు. ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం వెంకట మోహన్ మాట్లాడుతూ రసాయనిక అవశేషాల కారణంగా పంట ఉత్పత్తులకు తగిన ధరలు రావడం లేదని, రసాయనిక ఎరువుల స్థానంలో మన పూర్వీకుల తరహాలో సేంద్రీయ ఎరువులు వినియోగించాలన్నారు. మార్క్‌ఫెడ్ డీఎం శ్రీరాములు మాట్లాడుతూ గ్రామం యూనిట్‌గా తీసుకుని పంటలకు నాణ్యమైన ధరలు లభించేలా మార్కెటింగ్ శాఖ తరపున కృషి చేస్తున్నామన్నారు. పీలేరు ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం తరపున రైతులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ రైతును రాజు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, వాటి దరఖాస్తు విధానాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, ఏడీ రమణరావు, ఏఓలు రమాదేవి, కరుణాకర్ రెడ్డి, ఏఈఓ నజీర్, వీఏఏ హిమబిందు, నాయకులు అమరనాథరెడ్డి, బాబు, భానుప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ధ్యేయం

నిమ్మనపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు పండిచిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేసి వారికి గిట్టుబాటు ధర కల్పిస్తుందని సివిల్ సప్లై డీఎం సుమతి, ఏడీఏ రమేష్ పేర్కొన్నారు. బుధవారం కొండయ్యగారిపల్లి పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లిలో రైతులు పడించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. దళారులు, మధ్యవర్తులు, మిల్లర్ల చేతిలో రైతులు నష్ట పోకుండా వుండేందుకు ప్రభుత్వమే రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ముఖ్యంగా రైతులు ఖచ్చితంగా ఈ-కేవైసీ పూర్తి చేసుకుని వుండాలని తెలిపారు. బయటి మార్కెట్‌లో కొనుగోలు చేసే ధర కంటే అధికంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 100 కిలోలకు రూ.2389లను అందిస్తుందని తడిసిన ధాన్యాన్ని 17శాతం కంటే తక్కువ వుంటే వాటిని కూడా కొనుగోలు చేస్తుందని తెలిపారు. అనంతరం రైతుల వద్ద సుమారు 100బస్తాలు ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఓ మంజుల, ఎంపీడీఓ పక్రుద్దీన్ ఏఓ రమేష్, డిప్యూటీ ఎంపీడీఓ లక్ష్మిపతి రైతులు పాల్గొన్నారు.

మోరగుడి పీహెచ్‌సీలో గొడవ

● స్వీపర్ ఆత్మహత్యాయత్నం ● ఆస్పత్రికి తాళం వేసిన సిబ్బంది



చికిత్స పొందుతున్న స్వీపర్ సుజాత, పీహెచ్‌సీకి తాళం వేసిన దృశ్యం

జమ్మలమడుగు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోరగుడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం గొడవ జరిగింది. ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ తస్మియా, సిబ్బంది విధుల విషయంలో తనపై వేధింపులకు పాల్పడుతున్నారంటూ స్వీపర్ సుజాత పెట్రోలు వంటిపై పోసుకుని ఆత్మహత్యాప్రయత్నం చేసింది. దీంతో వెంటనే డాక్టర్, అక్కడున్న సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తాళం వేశారు. అప్పటికే అక్కడున్న బాధితురాలి బంధువులు జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతోంది. వివరాలిలా... మోరగుడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వీపర్ సుజాతకు డాక్టర్ తస్మియా, సిబ్బంది మధ్య విధులకు సంబంధించి వివాదం జరుగుతోంది. స్వీపర్ తనకు సెలవులు అడిగినా డాక్టర్ మంజూరు చేయడం లేదని.. పనికి సంబంధించి సిబ్బంది వేధింపులకు గురిచేస్తుండ డంతో ఆత్మహత్యాయత్నం చేసినట్లు బాధితురాలి బంధువులు తెలిపారు. కాగా, ఆస్పత్రి డాక్టర్ తస్మియా, సిబ్బంది తాము స్వీపర్‌తో మాట్లాడుతుండగా ఆమె బంధువులు తమపై దాడి చేశారని ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి అర్బన్ సీఐ నరేష్‌బాబు విచారణ చేసి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

వల్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కడప - తాడిపత్రి ప్రధాన రహదారిలో గోటూరు పాత టోల్‌గేటు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు కర్నూలుకు చెందిన వెంకటేశులు, లక్ష్మీదేవి ద్విచక్రవాహనంలో కడప నుంచి కమలాపురం వైపు వస్తున్నారు. అదే సమయంలో వల్లూరు నుంచి కడప వైపు వెళుతున్న ఆటో వీరిని ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయలైనట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. కానీ ప్రమాదంలో గాయడపడ వెంకటేశ్వర్లు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించినట్లు సమాచారం. అలాగే మరో ప్రమాదంలో గోటూరు సమీపంలోని పెట్రోలు బంకు వద్ద క్రేన్ ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో స్కూటరిస్టుకు గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కొప్పోలికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కూలీలతో వెళుతున్న ఆటోను ఢీకొన్న కారు

● 8 మందికి తీవ్ర గాయాలు



కారు ఢీకొనడంతో బోల్తా పడ్డ ఆటో, క్షతగాత్రులను స్వయంగా తరలిస్తున్న సీఐ, కమిషనర్

మైదుకూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు సమీపంలోని అరోమా హోటల్ ఎదురుగా కడప-కర్నూలు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 మంది గాయపడ్డారు. కడప వైపు నుంచి స్థానిక సరస్వతిపేటకు చెందిన కూలీలతో వస్తున్న ఆటోను వెనకవైపు నుంచి కారుడీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న సీఐ రమణారెడ్డి, కమిషనర్ రంగస్వామిలు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108లో మైదుకూరు ఆసుపత్రికి తరలించడంలో సహాయపడ్డారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కడప, ప్రొద్దుటూరుకు తరలించినట్లు వైద్యులు డాక్టర్ కరీముల్లా తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

నాన్ బెయిలబుల్ వారెంటు ఉన్న వ్యక్తి అరెస్టు

చెన్నూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చెన్నూరుకు చెందిన గంధం నాగరాజు అలియాస్ చిలక అనే వ్యక్తిపై నాన్ బెయిలబుల్ వారెంటు ఉండటంతో బుధవారం అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ క్రిష్ణారెడ్డి తెలిపారు. చెన్నూరు కొత్త రోడ్డు సరస్వతీ నగర్‌కు చెందిన నాగరాజు 2001లో జరిగిన ఓ హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఇతనిపై నాన్‌బెయిలబుల్ వారంటు ఉన్నా తప్పించుకుని తిరగడంతో బుధవారం అతనిపై నిఘా పెట్టి ఇంటి వద్ద అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

లావనూరులో కొండచిలువ కలకలం

కొండాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లావనూరు ఎస్సీ కాలనీలో బుధవారం కొండచిలువ కలకలం రేపింది. స్థానికంగా ఆదినారాయణ అనే వ్యక్తి ఇంటి సమీపంలో స్థానికులు కొండచిలువను గమనించారు. వెంటనే పాములు పట్టే వ్యక్తిని పిలిపించి పట్టుకున్నారు. అనంతరం కొండచిలువను ఫారెస్టు అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. వారం రోజుల కిందట పాత కొండాపురం గ్రామంలో కొండచిలువ కోడిని పట్టుకొని చంపుతుండగా స్థానికులు గమనించి చంపేశారు.

నేటి నుంచి కాశినాయన ఆరాధనోత్సవాలు



జ్యోతి క్షేత్రంలో ఏర్పాటు చేసిన స్వాగత తోరణం



అన్నదానం (వంటకు)కు ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

కాశినాయన, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరికుంట్ల సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలోని జ్యోతీ క్షేత్రంలో గురువారం నుంచి కాశినాయన 30వ ఆరాధనోత్సవాలు ప్రారంభమవు తాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. రెండురోజుల పాటు సాగే ఈ ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. అన్నదానం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు భక్తులను ఆకట్టుకునేలా ఉన్నాయి.

35 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

ఈ ఆరాధనోత్సవాలకు మైదుకూరు డిపోకు చెందిన 25 బస్సులు, గిద్దలూరు డిపో నుంచి 10 బస్సులు నడపనున్నట్లు మైదుకూరు డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ విజయమ్మ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం గురు, శుక్రవారాల్లో మైదుకూరు, పోరుమామిళ్ల, గిద్దలూరు నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతామన్నారు. కాగా, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో 150 మందితో పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోరుమామిళ్ల సీఐ హేమసుందర్‌రావు, ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. ఇందులో 6 మంది ఎస్ఐలు, ముగ్గురు సీఐలు, 119 మంది పోలీసులు, 8 మంది మహిళా పోలీసులు, 14 మంది స్పెషల్ పార్టీ పోలీసులు ఉంటారన్నారు. ఇక మండల వైద్యాధికారులు డాక్టర్, ప్రశాంతి, డాక్టర్ పుష్ప ఆధ్వర్యంలో 5 మంది వైద్య ఆరోగ్య సిబ్బందితో ప్రత్యేక వైద్యశిరం ఏర్పాటు చేస్తున్నట్లు వైద్య ఆరోగ్య విస్తరణా ధికారి బాలయ్య తెలిపారు.

6 నుంచి బ్రౌన్ గ్రంథాలయ వారోత్సవాలు

కడప కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీపీబ్రౌన్ 142వ వర్ధంతి (డిసెంబరు 12)ని పురష్కరించుకుని స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈనెల 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు బ్రౌన్ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. అందులో భాగంగా 6వ తేదీ ఉదయం 9 గంటలకు 6, 7, 8, తరగుతుల విద్యార్థులకు పద్యపఠనం (వేమన, సుమతి శతకాలలోని 6పద్యాలు.. ప్రతీ శతకం నుంచి మూడు పద్యాలు ఉండాలన్నారు. 7వ తేదీ ఉదయం 9 గంటలకు 9, 10 తరగుతుల విద్యార్థులకు బ్రౌన్ జీవితం-సాహిత్యం అనే అంశంపై వకృత్వం పోటీలు, 8వ తేదీ 3, 4, 5, తరగతుల విద్యార్థులకు చిత్రలేఖనం, 9వ తేదీ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ధారణ పరీక్ష (అంశం రామాయణ, భారత, భాగవతాలలోని విషయాలు)ఉంటుందన్నారు. 10వ తేదీ 8, 9, 10 తరగతుల వారికి కథాపురాణం, 11వ తేదీ 8, 9, 10 తరగతుల విద్యార్థులకు క్విజ్ (కడప జిల్లాకు చెందిన వైజ్ఞానిక అంశాలపై) పోటీలు ఉంటాయన్నారు. 12వ తేదీ శుక్రవారం సాయంత్రం 5 గంటలకు జరిగే ముగింపు సమా వేశంలో విజేతలకు బహుమతుల ప్రదానం జరుగుతుందన్నారు.

62 స్కూల్‌వ్యాన్లు తనిఖీ

సీకేదిన్నె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాహనాల తనిఖీల్లో భాగంగా జిల్లాలో 62 పాఠశాల బస్సులను తనిఖీ చేసినట్లు ఇన్‌చార్జి డీటీసీ వీర్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల బస్సు ప్రమాదం జరిగిన నేపథ్యంలో ప్రత్యేకంగా చేపట్టిన స్కూలు వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా కడప డివిజన్‌లో 22 బస్సులను తనిఖీ చేయగా 10 కండీషన్‌లో ఉన్నాయని, బద్వేలు డివిజన్‌లో ఆరు చెక్ చేయగా అయిదు బస్సులు మంచి కండీషన్‌లో ఉన్నాయన్నారు. పులివెందులలో ఆరు బస్సులకు గాను నాలుగు, ప్రొద్దుటూరులో 28 బస్సులుకు 19 కండీషన్‌లో ఉన్నాయన్నారు. మొత్తం 62 పాఠశాల వాహనాలను రవాణా శాఖ అధికారులు తనిఖీ చేయగా 38 కండీషన్‌లో ఉండగా, కండీషన్‌లో లేని 24 బస్సుల యజమానులకు నోటీసులు అందించినట్లు తెలిపారు. పాఠశాల వాహనాల యజమానులు బస్సులను ఎప్పటికప్పుడు కండీషన్‌లో ఉంచుకోవాలని, విద్యార్థుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

సిగటోక ఆకుమచ్చ తెగులుపై శిక్షణ

సింహాద్రిపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిగురిజాల, బలపనూరు గ్రామాల్లో బుధవారం అరటిలో సిగటోక ఆకుమచ్చ తెగులుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అరటి పరిశోధన శాస్త్రవేత్త శిరీష మాట్లాడుతూ డిసెంబరులో చలి తీవ్రత, గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉండడంతో సిగటోక తెగులు వ్యాప్తి అయ్యే అవకాశం ఉందన్నారు. తెగులు ప్రారంభ దశలో మంకోజెబ్ లేదా క్లోరోతలోనిల్ ఒక లీటర్ నీటికి రెండు గ్రాముల చొప్పున పిచికారీ చేయాలన్నారు. 15 రోజుల తర్వాత ప్రొపైకొనాజోల్ ఒక లీటర్ నీటికి ఒక మిల్లీ లీటర్ పిచికారి చేసుకోవాలన్నారు. గెల వేసిన తర్వాత అజాక్షి స్ట్రోబిన్+డైఫెనాకానాజోల్ ఒక లీటర్ నీటికి ఒక మిల్లీ లీటర్ పిచికారీ చేసుకోవాలన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి సతీష్, సూక్ష్మనీటి శాఖ పీడీ వెంకటేశ్వరరెడ్డి, ఉద్యాన శాఖ అధికారి మల్లేశ్వరరెడ్డి, ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఐదు లక్షలు లోను వచ్చిందని.. మోసం

● మోసపోయిన సీనియర్ సిటిజన్

మదనపల్లె అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ ట్రెజరరీ కార్యాలయం వద్ద బుధవారం విశ్రాంత ఉద్యోగి శ్రీనివాసులు నుంచి ఐదు లక్షలు లోను సిద్ధంగా ఉందని, ఒక లక్ష ముపై వేలు ఇస్తే ఇప్పడే చెక్కు అందిస్తామని ఒక్కడు నమ్మబలికి మోసం చేశాడు. మదనపల్లె పట్టణం, ప్రశాంతనగర్‌కు చెందిన శ్రీనివాసులు ఫార్మసీ అసిస్టెంట్‌గా రిటైర్డ్ అయ్యాడు. బుధవారం తన పెన్షన్ చెక్ చేసుకోవాడానికి వచ్చిన ఆయన సబ్ ట్రెజరీ కార్యాలయంలో అధికారులు మీటింగ్‌లో ఉండడంతో అక్కడ కొద్దిసేపు వేచి ఉండగా.. సీనియర్ సిటిజన్‌తో మాటలు కలిపి లోన్ ఐదు లక్షలు చెక్కు ఇవ్వాలంటే లక్షముపై వేలు కట్టాలన్నారు. శ్రీనివాసులు కదిరి రోడ్డులోని ఇండియన్ బ్యాంకుకు వెళ్లి వెంటనే రూ.50వేలు విత్‌డ్రా చేసి మిగిలిన అమౌంట్ కోసం అల్లుడైన మోహనకు ఫోన్ చేసి విషయం చెప్పకుండా రూ.80 వేలు డబ్బు కావాలని తెలిపారు. వెంటనే అల్లుడు రూ.50 వేలు మామ శ్రీనివాసులుకు ఇచ్చి తిరిగి రూ.30 వేలు కోసం వెళ్లాడు. ఇంతలోనే అక్కడే ఉన్న వ్యక్తి లక్ష రూపాయులు శ్రీనివాసులు వద్ద తీసుకుని ఆధార్ జిరాక్స్ తీసుకురావాలని చెప్పడంతో సీనియర్ సిటిజన్ శ్రీనివాసులు జిరాక్స్ కోసం వెళ్లి తిరిగి వచ్చేలోపే అక్కడి నుంచి ఆ వ్యక్తి ఉడాయించాడు. వెంటనే వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీ పుటేజ్‌ల్లో మాట్లాడుతున్న అతని పేరు సాధిక్‌గా చెప్పారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం, కొత్తపల్లె వద్ద గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహన్ని స్థానికులు బుధవారం గుర్తించారు. తాలుకా ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల మేరకు కొత్తపల్లె పంచాయతీ, చెంబకూరు రోడ్డులో ఓ వృద్ధుడు చనిపోయి ఉండగా గ్రామస్థులు సమాచారం అందించారు. సంఘటన స్థలం చేరుకుని మృతదేహన్ని పరిశీలించి వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. వృద్ధుడు మాసిన తెల్లని గడ్డం, నిక్కరు, సిమెంట్ కలర్ చొక్కా ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు తాలుకా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు విద్యార్థినులు

ఎర్రగుంట్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిలమకూరు జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతు న్న పి.సింధుప్రియ రాష్ట్ర స్థాయి కౌశల్‌సైన్స్ క్విజ్‌పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పద్మనాభం తెలిపారు. అలాగే డి.దీపిక కౌశల్‌రీల్స్‌కి ఎంపికైందన్నారు. తిరుపతిలో డిసెంబరు 27న జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరిగే రాష్ట్రస్థాయి కౌశల్ క్విజ్ పోటీల్లో పాల్గొంటారన్నా రు. విద్యార్థుల ఎంపికపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అస్మిత్ ఖేలో ఇండియా షూటింగ్‌బాల్ లీగ్ పోటీలు

నిమ్మనపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీలోని ఏపీ మోడల్ స్కూల్ ఈ నెల 7న అస్మిత్ ఖేలో ఇండియా షూటింగ్‌బాల్ లీగ్ పోటీలు నిర్వహించ నున్నట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి గౌతమి తెలిపారు.

బుధవారం ఆమె మాట్లాడుతూ భారత మంత్రిత్వ శాఖ ప్రతిష్టా త్మకంగా దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న అస్మిత్ ఖేలో ఇండియా పోటీల్లో షూటింగ్ బాల్‌ను కూడా చేర్చినట్లు తెలిపారు. దేశంలోని మూడు రాష్ట్రాల్లో రెండు యూనిట్లు మిగిలిన రాష్ట్రాల్లో ఒక యూనిట్‌గా పోటీలు నిర్వహించేందుకు సన్నద్ధం చేసినట్లు తెలిపా రు. ఇందులో భాగంగానే ఈ నెల 7న మోడల్ స్కూల్‌లో షూటిం గ్‌బాల్ పోటీలు జరుగుతాయని ఆమె తెలిపారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న జడ్జి మహేష్

పీలేరు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పట్ల వివక్ష చూపరాదని 11వ జిల్లా అదనపు జడ్జి మహేష్ తెలిపారు. బుధవారం పీలేరు భవిత కేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల శ్రేయస్సు, వారి అభివృద్ధిని కోరుతూ అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. దివ్యాంగుల ఉన్నతి కోసం ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సామాజిక అభివృద్ధిలో పురోగతి సాధించాలన్నారు. అంగ వైకల్యం ఉన్న వారు ధైర్యంగా అన్ని రంగాల్లో దూసుకు పోవాలని సూచించారు. అనంతరం మండల, డివిజన్, జిల్లా స్థాయి పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ షేక్, ఎంపీడీఓ శివశంకరయ్య, ఎంఈఓ పద్మావతి, మెయిన్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయపాల్ రెడ్డి, స్పెషల్ ఎడ్యుకేటర్ లలితకుమారి, భవిత పాఠశాల ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, ధరణిజ, పీఆర్‌పీ మురళీధర్ రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I, VANGASAM TEJESH (Old Name), R/of Plot No-77, SY No-551/3, YSR Colony, Near Masijid, Madanapalle-517325, ANNAMAYYA, DIST, AP., have changed my name to TEJESH REDDY VANGASAM (New Name) S/o VENKATA RAMANA REDDY VANGASAM.
AJT - 1886

CHANGE OF NAME
I, DANDU PYARIJOHN SAHEB YASIN BASHA (Old Name) S/o PYARIJOHN SAHEB R/at D.No.15-3266, Sankaraiah Gunta,Greampet Chittoor Dist – AP, India, declare that I have changed my name to DADAPEER PYARIJOHN YASIN BASHA, (New Name) S/o PYARIJOHN SAHEB. Henceforth, I shall be known as DADAPEER PYARIJOHN YASIN BASHA (New Name)
AJT - 1887

బిజినెస్ ఆఫర్
తక్షణం వ్యాపార భాగస్వాములు వెతుకుతున్నాము. అవకాశాన్ని కోల్పోకండి. సంప్రదించండి. RSJ Inspection Service Ltd. Cell:8595924917,8800629648
AJA-257588

CHANGE OF NAME
I, GARALA RAJESWARAMMA, R/at H.No. 15-297-3, Gopal Reddy Street, Madanapalle-517325, Annamayya Dist, AP, have changed my name to GARLA SUBRAMANYAM RAJESWARI (New Name), W/o GARALA NARASIMHAIAH SUBRAMANYAM.
AJT - 1885

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 257593

డిటిపి ట్రైనింగ్
స్వయం ఉపాధికై పేజ్‌మేకర్, తెలుగు టైపింగ్, ఫోటోషాప్, ఎం.ఎస్.ఆఫీస్, కోరెల్‌డ్రా మొ॥ ఏదేని డిటిపి కోర్సును నేర్వాలని ఉందా? సం.ప్ర.: మురళీస్ జి-ఇన్ఫో, ఎన్.టి.ఆర్. సర్కిల్, తిరుపతి. సెల్:83090 73928, 94948 89525.
AJT -1870

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

రైతుల సమస్యలను పరిష్కరించేందుకే రైతన్నా మీకోసం

అధికారులు సమన్వయంతో రైతులకు సేవలందించాలి ● ఆధునిక పరికరాల కోసం కార్యాచరణ

● వర్క్‌షాప్‌లో ఎమ్మెల్యే షాజహాన్‌బాష





కొత్తవారిపల్లె వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష - గుమ్మసముద్రంలో ముఖ్యమంత్రి సందేశాన్ని చూస్తున్న రైతులు - మర్రికుంటపల్లెలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి

మదనపల్లె టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు పరిష్కారానికి, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 'రైతన్నా మీకోసం' చేపట్టిందని ఎమ్మెల్యే షాజహాన్‌బాష అన్నారు. బుధవారం కొత్తవారిపల్లె సచివాలయంలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రైతుల వద్దకు అధికారులు వెళ్లి వారికి అవసరమైన పథకాలు, పనుల గురించి అడిగి తెలుసుకుంటారన్నారు. వీటిపై ప్రభుత్వం సమీక్షించి ఇప్పుడు అందుతున్న పథకాలను మరింత చేరువ చేసేందుకు వీలుంటుందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శివరామ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ ఎమ్మెల్యేలతో కూటమి ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్ ప్రజలకు చేదోడుగా నిలుస్తోందన్నారు. వ్యవసాయశాఖ అధికారి నవీన్ కుమార్, ఉద్యానశాఖ అధికారి ఈశ్వర్‌ప్రసాద్, పశుసంవర్థకశాఖ వైద్యులు షిరీన్ లారెన్స్, ప్రసాద్‌రెడ్డి ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం కొత్తవారిపల్లె, పోతబోలు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి మైక్రో ఇరిగేషన్ పీడీ లక్ష్మీప్రసన్న, పశుసంవర్థకశాఖ డీడీ రసూల్, టీడీపీ నేతలు శ్రీనివాసులు, ప్రసాద్, సహదేవ, బొజ్జన్న, ఎస్.సుధాకర్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోసమే...

బి.కొత్తకోట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రైతన్నా-మీకోసం చేపట్టిందని సింగిల్ విండోచైర్మన్ నారాయణ, ఏఓ చంద్రశేఖర్ అన్నారు. గుమ్మసముద్రంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ముఖ్యమంత్రి వీడియో సందేశాన్ని రైతులకు చూపించారు. పట్టణంలో ఈ నెల 4 నుంచి వేరుశనగ విత్తనకాయల పంపిణీ ప్రారంభిస్తున్నట్లు ఏఓ ప్రకటించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ జ్యోతిక, కిట్టన్న, పద్మనాభం, మస్తాన్, రామప్ప, రామి రెడ్డి పాల్గొన్నారు.

ఆధునిక పరికరాల కోసం కార్యాచరణ

కలికిరి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు కావలసిన ఆధునిక పరికరాల వివరాలను సేకరించి కార్యాచరణ ప్రణాళిక రూపంలో ప్రభుత్వానికి అందజేయనున్నట్లు వాల్మీకిపురం ఏడీఏ నాగప్రసాద్ తెలిపారు. మర్రికుంటపల్లెలో జరిగిన వర్క్ షాపులో పాల్గొన్న రైతులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఉద్యాన పంటలకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాల్సి ఉందన్నారు. సర్పంచు రెడ్డిరాము, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మాలతి, ఉద్యాన పాలిటెక్నిక్ అధ్యాపకులు టి.శాంతకుమారి, ఎ.రామాంజనేయ రెడ్డి, ఏఈఓ ఇంద్ర, ఆత్మ బీటీఎం అమృత్‌కుమార్‌రెడ్డి, ఆర్ఎస్కే ఇన్‌చార్జి ఎ.బిందు, కేవీకే శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

పంచసూత్రాలపై అవగాహన

పెద్దతిప్పసముద్రం డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంచసూత్రాలపై ఏఓ ప్రేమలత అవగాహన కల్పించారు. రైతు వారోత్సవాల్లో భాగంగా సిబ్బందితో కలిసి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కాట్నగల్లు, కమ్మచెరువు రైతులకు వ్యవసాయంలో తీసుకోవాల్సిన మెలకువలను వివరించారు. రైతుల ముఖాముఖీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల వ్యవసాయశాఖ సహాయకులు, రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పథకాలు అందేలా చూస్తాం

గుర్రంకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అర్హులందరికీ చేరేలా చూస్తామని ఏఓ రత్నమ్మ అన్నారు. గుర్రంకొండ రైతు సేవా కేంద్రంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు, మందులను ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల్లో అందజేస్తుందన్నారు. ప్రతి రైతు సంక్షేమ పథకాలు పొందేలా వ్యవసాయశాఖ సిబ్బంది పని చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతి రైతు లాభాలు గడించాలి

కలకడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో డిమాండ్ వున్న పంటసాగును ఎంచుకుని ప్రతి రైతు లాభాలు గడించాలని ఏఓ శ్రీనివాస్ అన్నారు. కలకడలో ఆయన మాట్లాడుతూ నీటి వనరుల పొదుపునకు డ్రిప్ పద్ధతితో పంట తడులు ఇవ్వాలని సూచించారు. రైతు అభ్యున్నతికి ప్రభుత్వం అమలు జేస్తున్న పథకాలు, మద్దతు ధరలపై అవగహన కల్పిం చారు. నేత ఇనాయతుల్లా, సిబ్బంది చందన, ఇంద్రజ, రైతులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సు కోసమే...

పెద్దమండ్యం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతుల కోసమే ప్రభుత్వం రైతన్న-మీకోసం నిర్వహిస్తున్నట్లు డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. బండమీదపల్లిలో మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 'రైతన్న- మీకోసం'లో పీడీ మాట్లాడుతూ రైతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. రైతుకు సాయంగా అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేసిందన్నారు. ప్రభుత్వ వ్యవసాయ ఏపీ యాప్ ద్వారా పంటలకు సాగు, దిగుబడులు, తెగుళ్లు, నివారణ పిచికారీ మందుల వాడకం, వాతావరణం, గిట్టుబాటు ధరలపై సలహాలు సందేహాలను అందిస్తున్నట్లు వెల్లడించారు. ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ విత్తన కాయలు, ఎరువులు అందుబాటులో అందిస్తున్న ఘనత ప్రభుత్వం సాధించిందన్నారు. అర్హులందరికీ పథకాలు అందుతాయన్నారు. పంటల సాగులో పురోగతి సాధనకు వ్యవసాయధికారు లు కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఏఓ సురేష్ బాబు, ఏపీఓ సురేంద్రారెడ్డి, ఏఈఓ శివకుమార్ నాయుడు, వెటర్నరీ డాక్టర్ చరిత, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్, వీహెచ్‌ఏ షమీనా, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

అండర్ పాసింగ్ నిర్మాణానికి సహకరించాలని వినతి



తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

పీలేరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తమ పొలాలకు దారి కోసం ప్రతిపాదించిన అండర్ పాసింగ్ నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలని దొడ్డిపల్లె రైతులు తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పీలేరు-మదనపల్లె జాతీయ రహదారి నిర్మాణం కారణంగా సంజయ్ గాంధీ డిగ్రీ కళాశాల పరిసరాల్లోని వ్యవసాయ భూములకు దారి సౌకర్యం లేకుండాపోయిందన్నారు. దారి కోసం తాము కలెక్టర్, ఎన్‌హెచ్ఏఐ అధికారులను విజ్ఞప్తి చేయగా వారు డిగ్రీ కళాశాల వెనుక ప్రాంతంలో అండర్ పాసింగ్ మంజూరు చేశారన్నారు. అయితే నిర్మాణం చేపట్టరాదని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆయన అభ్యంతరాల కారణంగా మంజూరైన అండర్ పాసింగ్ రద్దు అయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ రికార్డుల్లో దారి సౌకర్యం ఉన్నా ప్రిన్సిపాల్ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారన్నారు. రికార్డులు, నిబంధనల మేరకు వ్యవహరించి తమ పొలాలకు దారి కల్పించే నిర్మాణానికి సహక రించాలని వారు తహసీల్దారును కోరారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తాం : చైర్మన్



శివరామ్‌ను సన్మానిస్తున్న యూనియన్ నేతలు

మదనపల్లె టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): టమోట మార్కెట్ యార్డులో లారీ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరామ్ హామీ ఇచ్చారు. బుధవారం రాష్ట్రీయ చాలక్ ఏక్తా మంచ్ ట్రేడ్‌యూనియన్ ఆధ్వర్యంలో లారీ డ్రైవర్లు చైర్మన్ శివరామ్‌ను కలసి తమ సమస్యలను ఏక రువు పెట్టారు. యార్డులో టమోట లోడింగ్ హమాలీలు మామూళ్ల కింద ఒక్కో లారీకి రూ.3వేలు అడుగుతున్నారని, లేకుంటే లారీకి లోడింగ్‌లో జాప్యం చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఆలస్యంగా లోడింగ్ చేస్తుండడంతో వారణాసి, కలకత్తా, భువనేశ్వర్, చత్తీస్‌ఘడ్ ప్రాంతాల మార్కెట్‌కు లారీలు సమయానికి చేరుకోలేపోతున్నాయన్నారు. లారీలను వేగంగా నడిపి డ్రైవర్లు ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని వాపోయారు. మార్కెట్‌ను పట్టణం వెలుపలికి మారిస్తే తమకు సమయం అనుకూలంగా ఉంటుందన్నారు. చైర్మన్ మాట్లాడుతూ త్వరలోనే హమాలీ యూనియన్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. అనంతరం చైర్మన్ శివరామ్‌ను యూనియన్ నేతలు సన్మానించారు. డ్రైవర్ల యూనియన్ నేతలు కమర్‌బాషా, సురేష్ బాబు, చాంద్‌బాషా, వెంకటరమణ, మురళి తదితరులు పాల్గొన్నారు.



స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాలి



ఐక్యతను చాటుతున్న దివ్యాంగులు

మదనపల్లె, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో దివ్యాంగుల రిజర్వేషన్లను మూడు నుంచి ఐదు శాతానికి పెంచాలని వికలాంగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.మౌ ళా లి కోరారు. ప్రభుత్వం దివ్యాంగులకు పింఛను పెంచడంపై సంఘం నేతలు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని బేబీ వెల్కమ్ హోమ్ రెడ్ క్రాస్ భవనంలో బధిరుల ప్రత్యేక ప్రతిభావంతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. టీడీపీ ప్రత్యేక ప్రతిభావంతుల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కంచెర్ల వెంకట్రమణ నాయుడు మాట్లాడుతూ వికలాంగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఐటీయూసీ డివిజన్ కన్వీనర్ గొంగడి కృష్ణమూర్తి మాట్లాడుతూ దివ్యాంగులు ఎదుర్కొంటున్న న్యాయపర సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలన్నారు. బధిరుల ప్రత్యేక ప్రతిభావంతుల సంక్షేమ సంఘం సభ్యులు రెడ్డమ్మ, ఓబులపతి, రాజమ్మ, శంకర పాల్గొన్నారు.

పీటీఎం భవిత కేంద్రంలో....

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఎంఈఓ నారాయణ అధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులతో ఆయన మాట్లాడు తూ దివ్యాంగుల హక్కులకు భంగం కలిగించరాదని, వారిని తక్కువ చేయకూడదన్నారు. అనంతరం విద్యార్థులకు యంగ్ ఇండియా సేవా సమితి ద్వారా దుప్పట్లను పంపిణీ చేశారు. విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వ హించారు. పోటీల్లో ప్రతిభావంతు లకు బహుమతులను అందించారు. ఎంఈఓ-2 గౌస్ పీర్, వికలాంగుల జేఏసీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సురేంద్ర, భవిత కేంద్రం ఉపాధ్యాయులు ఆయేషా, పాఠశాల చైర్మన్ రాము, ఏఎస్ఐ వరప్రసాద్, యంగ్ ఇండియాసేవా సభ్యులు రెడ్డిబాష, కెవి.రమణ, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ విధానంలోనే ఇంటి పన్ను చెల్లింపులు

కలికిరి, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): ఇక నుంచి పన్నులను డిజిటల్ విధానంలోనే చెల్లించాలని కలికిరి పీడీఓ అశోక్ సూచించారు. గతంలో వలే పంచాయతీ ఉద్యోగులు, అధికారులకు నగదు చెల్లించరాదని స్పష్టం చేశారు. ఇంటిపన్ను, ప్లాన్ అప్రూవల్ తదితర రుసుములన్నీ కూడా ఫోన్‌పే, గూగుల్‌పే వంటి యూపీఐల ద్వారా సులభంగా చెల్లించవచ్చన్నారు. ఫోను వాట్సాప్ ద్వారా మనమిత్ర నుంచి చెల్లింపులు చేయొచ్చన్నారు. అందులో హౌస్ టాక్స్‌ను ఎంచుకుని చెల్లింపులు పూర్తి చేయవచ్చని వివరించారు.

'నిరుపేద రైతులకు సాగుభూమి పంపిణీ చేయాలి'

బి.కొత్తకోట, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): నిరుపేద రైతు కూలీలకు ఒక్కో కుటుంబానికి మూడెకరాల సాగుభూమిని పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి క్రిష్ణప్ప, తంబళ్లపల్లి నియోజకవర్గ కార్యదర్శి మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు. బీరంగి గ్రామంలో సీపీఐ గ్రామ సభల్లో వీరు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ మిగులు భూములు పెద్దపెద్ద భూస్వాములు తమ కబంధహస్తాల్లో పెట్టుకుని దశాబ్దాలుగా అనుభవించుకుంటున్నారని ఆరోపించారు. 2026జనవరి 4న బీరంగి గ్రామం లోని సోంపు రాళ్లమిట్ట వద్ద భూపోరాట సదస్సు నిర్వహించనున్నామన్నారు. ఈ పోరాట సదస్సుకు నిరుపేద వ్యవసాయ కూలీలందరూ హాజరవాలని పిలుపునిచ్చారు.

సమస్యలను పరిష్కరించండి

పీలేరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నెలకొన్న వాటర్ ప్లాంట్లు, వీధి లైట్లు, మురుగునీటి కాల్వల సమస్యలను పరిష్కరించాలని జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కలప రవి పంచాయతీ ఈఓకు విజ్ఞప్తి చేశారు. సమస్యలపై పార్టీ నేతలతో కలిసి వినతి పత్రం అందజేసిన ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణ, చెత్త కుండీల నిర్వహణ సరిగ్గా లేనందువల్ల దుర్గంధం వ్యాపిస్తోందన్నారు. తగిన చర్యలు చేపడతామని ఈఓ బ్రహ్మానంద రెడ్డి తెలిపారు. జనసేన నేతలు గజేంద్ర, నరేశ్, ధనశేఖర్, టీడీపీ నేత వెంకటరత్నం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

గుర్రంకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జడ్పీ హైస్కూల్‌లో బుధవారం రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలను నిర్వహించారు అండర్-14 విభాగంలో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశారు. బాలుర జట్టులో ముషాహిద్ రాజ్, సుల్తాన్, ముజకీర్, ముజ్జమీర్, ఢిల్లీ బాబు, పునీత్, జాన్‌లుక్, కార్తికేయ, ఉమా శంకర్, సంజయ్, ధర్మతేజ, బాలికల జట్టులో అర్చన, జ్యోత్స్న, జ్ఞానప్రసూన, సింధు, పల్లవి, ప్రసన్న, నవ్య, శ్రావ్య, దీపిక, తనూజ, ఆశాశ్రీ, రోస్లిన్ ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి చంద్రశేఖర్, ఎంఈఓ సుబ్రహ్మణ్యం, పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఓసూరి కిరణ్‌కు సన్మానం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 3:(ఆంధ్రజ్యోతి): బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఓసూరి కిరణ్‌కుమార్‌ను బుధవారం మదనపల్లె మండల బీజేపీ నేతలు సన్మానించారు. బీజేపీ నేత బండి ఆనంద్ మాట్లాడుతూ రైతు సమ స్యలపైనా, రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేయించాలని, గిట్టుబా టు ధరలు కల్పించి, మార్కెట్ యార్డు అభివృద్ధికి తోడ్పాటు అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పాపన్నగారి కృష్ణప్ప, బాలసుబ్రమ ణ్యం యాదవ్, నటరాజ్, మురళీ, అమర్నాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఓబీలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

పీలేరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నత్తనడకన సాగుతున్న ఆర్‌ఓబీల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సీపీఐ నేతలు సాంబశివ, టీఎల్ వెంకటేశ్ ప్రభుత్వాన్ని కోరారు. పీలేరులో బుధవారం పీలేరు నియోజకవర్గ సీపీఐ కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ ఆలస్యంగా జరుగుతున్న ఆర్‌ఓబీల నిర్మాణాల కారణంగా సామాన్యులు జీవనోపాధి, అత్యవసర సేవలు కోల్పోతున్నారన్నారు. వాటిని త్వరగా పూర్తి చేయడమే కాకుండా పీలేరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్న మురుగునీటి వ్యవస్థను బాగు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు నరసింహులు, వీవీ రమణ, శ్రీనివాసులు, బేబీ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

పాలసీని రూ.50 వేలకు పెంచాలి



ఎల్ఐసీ ఏజెంట్ల అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

పీలేరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతిఇ): ఎల్ఐసీ ఏజెంట్ల గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీని రూ.15 వేల నుంచి రూ.50 వేలకు పెంచాలని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నేతలు డిమాండ్ చేశారు. పీలేరులో బుధవారం ఎల్ఐసీ సంస్థ ఏజెంట్ల జిల్లా సర్వసభ్య సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారావు, సతీశ్ బాబు మాట్లాడుతూ ఎల్ఐసీ ఏజెంట్లు క్షేత్ర స్థాయిలో ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి పనిచేస్తున్నారన్నారు. వారికి, వారి కుటుంబానికి తగిన ఆర్థిక భరోసా కల్పించాల్సిన బాధ్యత ఎల్ఐసీపై ఉందన్నారు. ప్రభుత్వం గతంలో ఏజెంట్లకు రూ.25 వేల వృత్తి పన్ను విధించిందని, కనీస ఆదాయం కూడా లేని ఏజెంట్లకు అది చెల్లించడం భారంగా మారిందన్నారు. అందువల్ల ఏజెంట్లందరికీ వృత్తి పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న గ్రూపు ఇన్సూరెన్సు లబ్ధికి ఏజెంట్లకు ఉన్న 69 ఏళ్ల వయో పరిమితిని 80 ఏళ్లకు పెంచాలన్నారు. మెడిక్లెయిమ్‌ను రూ.3.5 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలన్నారు. అనంతరం పీలేరు శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఏకగ్రీవంగా జరిగిన ఈ ఎన్నికల్లో పీలేరు శాఖ అధ్యక్షుడిగా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్ రెడ్డి, కోశాధికారిగా రమణ ఎన్నికయ్యారు. సీనియర్ ఏజెంట్లు సంజీవ రెడ్డి, చంద్రశేఖర్, కేశవ, సుభాష్, పీలేరు, మదనపల్లె, చిత్తూరు, పుత్తూరు, శ్రీకాళహస్తి, నాయుడుపేట బ్రాంచీల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం ఎమ్మెల్యేకి ఎన్జీవోల వినతి



కిశోర్‌కుమార్ రెడ్డిని సత్కరించి వినతి పత్రం అందజేస్తున్న ఎన్జీవోలు

కలికిరి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పీలేరు నియోజకవర్గంలో గ్రామ స్థాయిలో పనిచేసే ఉద్యోగులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయించాలని పలువురు ఉద్యోగులు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డిని కోరారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు బుధవారం నగరిపల్లెలో ఎమ్మెల్యేను కలిసి సత్కరించి నియోజకవర్గంలో పనిచేసే కార్యదర్శులు, వీఆర్వోలకు ఇళ్ళ స్థలాలు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక్కొక్కరికి ఐదు సెంట్ల వంతున ఇళ్ళ స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మదనపల్లె కొత్త జిల్లాగా ఏర్పాటైన తర్వాత దీనిపైన చర్యలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కలికిరి పంచాయతీ కార్యదర్శి జి.అశోక్ ఆధ్వర్యంలో నియోజకవర్గం కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

8న సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పట్టాభిరామాలయంలో ఈనెల 8న సోమవారం ఉదయం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు సీతారాముల కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు పేర్కొన్నారు. ఉదయం కల్యాణం, హోమాది కార్యక్రమాలు, సాయంత్రం తిరుచ్చిపై సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడి నగరోత్సవం కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

కూలీల సంఖ్యను పెంచాలి

గుర్రంకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ పరమేశ్వరరెడ్డి సిబ్బందికి సూచించారు. కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిబ్బంది ఉపాధి పనులో కూలీలు పని చేసేలా చూడాలన్నారు. గ్రామాల్లో కూలీలు పనులకు వచ్చేలా అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ జయరామిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రం ఎస్ఐగా దిలీప్‌కుమార్

రామసముద్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం ఎస్ఐగా దిలీప్‌కుమార్ నియమితులయ్యారు. ఇతను ముదివేడు పోలీస్‌స్టేషన్ నుంచి రామసముద్రానికి బదిలీపై వచ్చారు. రామసముద్రంలో పనిచేస్తున్న ఎస్ఐ రమేష్‌బాబు జిల్లా సైబర్ క్రైమ్‌కు బదిలీ అయ్యారు.

స్క్రబ్ టైఫస్ ప్రాణాంతకం కాదు

పీలేరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ వ్యాధి ప్రాణాంతకం కాదని తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి గిరీషా పేర్కొన్నారు. గ్రామంలో బుధవారం సిబ్బందితో కలిసి స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అవగాహన కల్పించిన ఆమె మాట్లాడుతూ కీటకాలు కుట్టడం వల్ల కుట్టిన చోట నల్లని మచ్చలు లేదా దద్దుర్లు, తీవ్ర నొప్పులతో కూడిన జ్వరం, కళ్ల కలక లక్షణాలుంటే స్క్రబ్ టైఫస్ వ్యాధి ఉండవచ్చన్నారు. లక్షణాలు కనిపిస్తే వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. డిప్యూటీ హెచ్ఈ కొండయ్య, ఏఎన్ఎం ఫామున్నిసా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారులకు లేఖ రాశాము
ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధరం

మదనపల్లె టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'రెండు స్థంబాల దూరంలో ఆగిన నిరంతర విద్యుత్' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మదనపల్లె ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధరం స్పందించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పెద్దమండ్యం మండలానికి నిరంతరం విద్యుత్ సరఫరా అందించేందుకు ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌కో పరిధిలో వున్నాయన్నారు. వీటి నుంచి విద్యుత్ సరఫరా కోసం ఇప్పటికే ట్రాన్స్‌కో ఉన్నతాధికారులకు లేఖలు రాశామన్నారు. వారి నుంచి అనుమతి వస్తూనే మండలమంతా నిరంతర విద్యుత్ సరఫరా అందిస్తామని ఈఈ తెలిపారు.

చెరువు పరిశీలన

బి.కొత్తకోట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కానగల కుంట చెరువును నీటిపారుదలశాఖ డీఈ చెన్న కేశవరెడ్డి పరిశీలించారు. కానగలకుంట స్థలం కబ్జాకు గురైందని, ఈ చెరువులోకి చేరాల్సిన నీరు అధికారుల తప్పిదం వల్ల చేరడంలేదని, పైగా ఈ చెరువులోని నీరే బయటకు వచ్చి హంద్రీ-నీవా కాల్వలో కలిసి పోతోందని, దీనిపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు, రైతులు, జనసేన నేతల నుంచి ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై అధికారులు స్పందించక పోవడంతో స్థానికులే సొంత నిధులతో పనులు చేపట్టి చెరువులోకి నీరు వెళ్లేలా చేశారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు చెరువు పరిస్థితిని సమీక్షించారు. జనసేన ఆర్గనైజింగ్ సెక్రటరీ రెడ్డిమోహన్, నీటి సంఘం ప్రతినిధులు శంకర, విజయ్,విశ్వనాథ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలను పూర్తి చేయండి

పెద్దమండ్యం డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పక్కా గృహనిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ రమేష్‌రెడ్డి సూచించారు. వడ్డేపల్లెలో నిర్మాణంలో ఉన్న గృహనిర్మాణ పనులను పరిశీలించిన ఆయన గృహనిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయాలని, మరుగుదొడ్లను నిర్మించుకోవాలన్నారు. పీఎం ఆవాస్ యోజన పథకాన్ని 14వతేదీ వరకు అవకాశం ఉంటుందన్నారు.